PMR
BUILDING PLANNER
House Planning, Building permission, HMDA & DTCP Layout Permission Estimation, Home Loans, Valuations, Construction Drawings
P. Rajesh - 9866334557, 9100900931
polagonirajeshgoud@gmail.com
Ragannaguda Bus stop, Near Jawid Habib

సాయి
# సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com

కావలెను ...
ప్రతీ అక్షరం... ప్రజలకోసం ...
లక్ష్యంగా నిత్య నూతనంగా వెలువడుతూ ... పాఠకుల నుండి విశేష ఆదరణ పొందుతున్న
సాయి సూర్య
దిన పత్రికలో పనిచేయుటకు తెలుగు రాష్ట్రాల్లో ఔత్సాహికులకు ఆహ్వానం ...
ఉమ్మడి జిల్లా బ్యూరోలు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇంఛార్జ్ లు
మండల రిపోర్టర్లు
పాలగోని రాజేష్ గౌడ్ - సంపాదకులు 9100900931 www.saisuryaa.com

ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 66 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- సోమవారం - 26 - మే - 2025

## కొచ్చి తీరంలో మునిగిన నౌక... కంటైనర్లలో ప్రమాదకర కెమికల్స్!



- కేరళ తీరానికి దగ్గర్లో లైబీరియా భారీ నౌక పూర్తిగా మునక
- 640 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు, భారీగా ఇంధనం
- సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదంతో కొచ్చి తీరంలో హై అలర్ట్
- ఇంధనం, కంటైనర్లు తీరం వైపు వస్తే తాకొద్దని ప్రజలకు హెచ్చరిక
- నౌకలోని 24 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిన కోస్ట్ గార్డ్
- ఆయిల్ స్పిల్ మ్యాపింగ్‌తో పరిస్థితిని అంచనా వేస్తున్న అధికారులు

న్యూఢిల్లీ : లైబీరియా దేశానికి చెందిన ఓ భారీ సరకు రవాణా నౌక కేరళ సముద్ర తీరానికి సమీపంలో పూర్తిగా నీట మునిగిపోయింది. ఈ ఘటనతో సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత తీర రక్షక దళం (ఐసీజీ) ఈ విషయాన్ని ధృవీకరించింది. ప్రమాద సమయంలో నౌకలో ఉన్న సిబ్బందిని సురక్షితంగా కాపాడారు. మిగతా..2లో

## "ఉగ్రవాద నాయకుడు" యూనస్..
## బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నాడు..

2లో



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత షేక్ హసీనా, తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై విరుచుకుపడ్డారు. ఆయన బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నారని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ నెలలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని సైన్యం పిలుపునిచ్చిన తర్వాత, తాను రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మహ్మద్ యూనస్ తీవ్రవాద గ్రూపుల మద్దతుతో పరిపాలన చేస్తున్నారని షేక్ హసీనా ఆరోపించారు. ఇటీవల తన పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని ఆమె ఖండించారు. దీనిని రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ గుర్తు చేసుకుంటూ.. మిగతా..2లో

# మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్**

- మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను బాధించిందన్న కేటీఆర్
- ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలని వ్యాఖ్య
- తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందన్న బీఆర్ఎస్ నేత
- ఇలాంటి గడ్డపై ఓ మహిళకు అవమానకర పరిస్థితులు ఎదురుకావడం పట్ల ఆవేదన




2లో

హైదరాబాద్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువును, భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీకి ... మిగతా..2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ గుడ్ న్యూస్.. జూన్ 2న కీలక ప్రకటనలు!



జూన్ 2 ఆవిర్భావ దినోత్సవాన సీఎం ప్రకటన చేసే అవకాశం

పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదలపై సర్కార్ యోచన

ఇతర బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపునకు కూడా ప్రణాళిక

ఉద్యోగుల కోసం కొత్త ఆరోగ్య పథకం ప్రకటనపై చర్చ

ఉన్నతాధికారుల కమిటీ నివేదిక సీఎంకు త్వరలో సమర్పణ

## మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారు




హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలకు చాలా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలో ఇలాంటి కార్యక్రమం ఎవరూ చేపట్టలేదని అన్నారు. మిగతా..2లో

## పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం.. అది ఉగ్రవాదానికి అడ్డా..




- బహ్రెయిన్‌లో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు
- పాకిస్థాన్‌ను "విఫల రాజ్యం"గా అభివర్ణించిన ఒవైసీ
- ఉగ్రవాదానికి పాక్ ఊతమిస్తోందని, దాన్ని ఆపాలని డిమాండ్
- భారత్ సహనాన్ని తక్కువగా అంచనా వేయొద్దని పాక్‌కు గట్టి హెచ్చరిక
- బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని అఖిలపక్ష బృందంలో ఒవైసీ

## ఏపీలో జగన్, షర్మిల.. తెలంగాణలో కేటీఆర్, కవిత సీన్లు ఒక్కటే..!

2లో



**అన్నలు వదిలిన బాణాలు..**
**అన్నల మీదికే చెల్లెలు గురిపెడుతున్నారు.**

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో ఒకేలా సీన్లు రిపీట్ అవుతున్నాయన్నారు. తండ్రులు సంపాదించిన ఆస్తుల పంపకాల్లో, రాజకీయ పదవుల్లో పంపకాల్లో తేడాలు న్నాయని.. అన్నలు వదిలిన బాణాలు.. అన్నల మీదికే చెల్లెలు గురిపెడుతున్నారన్నారు. ఏపీలో జగన్ పై చెల్లి, షర్మిల బాణం ఎక్కు పెడితే, తెలంగాణలో కేటీఆర్ పై కవిత గురి పెట్టిందని విమర్శించారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడాని, ప్రజల అవసరాల కంటే, కుటుంబ అవసరాలే కీలకం అన్నట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## ఎన్టీఆర్ నుండి చంద్రబాబు వరకు.. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు!



అమరావతి : ఎన్టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వరకు రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు అని మంత్రి నిమ్మల రామా నాయుడు అన్నారు . నాడు ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తరువాత మిగతా..2లో

## భారత్‌లో మళ్లీ కరోనా కేసులు.. అత్యధికంగా ఈ రాష్ట్రంలోనే నమోదు!

2లో



# ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించింది**

**ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది**

**ఆపరేషన్ సింధూర్ అంటే కేవలం ఒక సైనిక మిషన్ కాదని, అది మన సంకల్పం, ధైర్యానికి ప్రతీక అని, మారుతున్న భారత దేశ ముఖచిత్రం**

**యోగాతో పాటు ఆయుర్వేదాన్ని మరింత అభివృద్ధి చేయవలసి ఉంది**

2లో

**వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని యోగా జీవన విధానాన్ని మారుస్తుం**

**మావోయిస్ట్ ప్రభావిత గ్రామానికి తొలిసారిగా బస్సు**

**ఇక ప్రధాని మోదీ గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా**

**విశాఖపట్నంలో జరిగే 'యోగదినోత్సవం'లో పాల్గొనే అవకాశం తమకు లభిస్తోందని ప్రధాన మంత్రి వెల్లడి**

**ఆపరేషన్ సిందూర్ పై మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ ఆసక్తికర విషయాలు**



న్యూఢిల్లీ : దేశం మాత్రమే కాదు ప్రపంచమంతా ఆపరేషన్ సిందూర్ గురించి ఆసక్తిగా చూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉగ్రవాదాన్నిఅంతం చేయడం దేశంలోని ప్రతిపౌరుడి సంకల్పమని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం సంఘటితమైందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు.

## జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!




న్యూఢిల్లీ : భారతదేశం తన సత్తా మరోమారు చాటింది. ప్రపంచంలోని అగ్ర దేశాలకు పోటీ ఇస్తూ భారత్ అన్ని రంగాలలోనూ దూసుకుపోతోంది. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించింది. జపాన్ దేశాన్ని వెనక్కి నెట్టిన భారత్ ఇప్పుడు గర్వంగా అగ్రదేశాల చెంత నిలిచింది. 4ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ చేరుకోవడం ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది. ఇప్పటివరకు 4వ స్థానంలో ఉన్న జపాన్ ను వెనక్కి నెట్టి భారత్ ఆ స్థానాన్ని దక్కించుకొని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వించదగ్గ అంశమని మిగతా..2లో

## ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం.. విజయసాయి రెడ్డి టీడీపీ కీలక నేతతో నిజంగానే భేటీ అయ్యారా?



2లో

అమరావతి : రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ వ్యవహారంపై వేగంగా దర్యాప్తు జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారిని అధికారులు ప్రశ్నించారు. వారిలో విజయ సాయి రెడ్డి కూడా ఉన్నారు. అయితే.. ఆయన విచారణకు హాజరయ్యే ముందు టీడీపీ కీలక నేతతో భేటీ అయ్యారనే వార్త ఇప్పుడు సంచలనంగా మారింది. విల్లాలోకి వెళ్తున్న విజయసాయి రెడ్డి.. లిక్కర్ స్కామ్‌పై ప్రత్యేక మిగతా..2లో

## నేను ప్రభుత్వానికి అనుకూలంగా కాదు.. ప్రతిపక్షానికి పనిచేస్తున్నాను.. శశిథరూర్ స్పష్టీకరణ




భారత్ సరిగ్గా అదే చేసినందుకు సంతోషంగా ఉంది

తమకు యుద్ధం కంటే ఆర్థిక ప్రగతే ముఖ్యమన్న కాంగ్రెస్ నేత

ఐదు దేశాల పర్యటనలో పార్లమెంటరీ బృందం

'ఆపరేషన్ సిందూర్' బృందానికి శశి థరూర్ సారథ్యం

పాకిస్థాన్‌ను దెబ్బకొట్టాలని తానే వ్యాసం రాశానన్న థరూర్

న్యూఢిల్లీ : : ఉగ్రవాదం ప్రపంచానికి ఉన్న అతి పెద్ద సమస్య.. దీనిపై మనం ఐక్యంగా పోరాడాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు.

# కొచ్చి తీరంలో మునిగిన నౌక... కంటైనర్లలో ప్రమాదకర కెమికల్స్!

మొదటి పేజి తరువాయి

కొచ్చి తీరానికి సుమారు 38 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎంఎస్‌సీ ఎల్సా-3 అనే పేరు గల ఈ 184 మీటర్ల పొడవైన నౌక తొలుత ఒక వైపునకు ఒరిగిపోయింది. ఆ సమయంలో కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. తాజాగా, నౌక పూర్తిగా సముద్రంలో మునిగిపోయిందని ఐసీజీ అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం 640 కంటైనర్లు ఉన్నాయని, వీటిలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. మరో 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్ ఉందని, మిగిలిన వాటితో పాటు నౌకలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ రసాయనాలు, ఇంధనం సముద్రంలో కలిస్తే తీవ్ర పర్యావరణ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో కొచ్చి తీరంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. సముద్రంలో తేలియాడుతున్న కంటైనర్లు గానీ, బయటకు వచ్చిన ఇంధనం గానీ తీరం వైపు కొట్టుకువస్తే వాటిని తాకవద్దని కేరళ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలను హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం ఎంతమేరకు వ్యాపించిందో తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ'ని ఉపయోగిస్తున్న విమానం నిరంతరం గగనతలంలో పర్యవేక్షిస్తోందని అధికారులు వివరించారు. విఝింజం పోర్టు నుంచి శుక్రవారం బయలుదేరిన ఈ నౌక, శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉంది. అయితే, మార్గమధ్యంలోనే ఈ దుర్ఘటన జరిగింది. నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన భారత తీర రక్షక దళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. నౌకలో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన వల్ల తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. సముద్ర కాలుష్యాన్ని వీలైనంతగా నివారించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# "ఉగ్రవాద నాయకుడు" యూనస్.. బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నాడు..

మొదటి పేజి తరువాయి

సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అమెరికాకు ఇవ్వడానికి నిరాకరించినందుకు ఆయన హత్యకు గురయ్యారని చెప్పారు. "అమెరికా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని కోరుకున్నప్పుడు, నా తండ్రి అంగీకరించలేదు. ఆయన తన ప్రాణాలను అర్పించాల్సి వచ్చింది. నాకు అలాంటి విధి వచ్చింది. ఎందుకంటే అధికారంలో ఉండటానికి దేశాన్ని అమ్మేయాలనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు" అని ఆమె ఫేస్‌బుక్ పోస్టులో చెప్పింది. "ఈ దేశ ప్రజలు జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పిలుపునకు స్పందించి, ఆయుధాలు చేపట్టి పోరాడి, మూడు మిలియన్ల మందిని విడిపించడానికి తమ ప్రాణాలను అర్పించిన దేశం ఇది. ఆ దేశ నేలలో ఒక్క అంగుళం కూడా ఎవరికీ వదులుకోవాలనే ఉద్దేశ్యం ఎవరికీ ఉండదు. కానీ ఈ రోజు ఎంత దురదృష్టం. అలాంటి వ్యక్తి(యూనస్) అధికారంలోకి వచ్చాడు, మొత్తం దేశ ప్రజలచే పూర్తిగా ప్రేమించబడే వ్యక్తి, ప్రపంచం ప్రేమించబడే వ్యక్తి అయిన ముజిబుర్ రెహమాన్‌కి యూనస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం జరిగింది.?" అని ఆమె ప్రశ్నించారు. తీవ్రవాద గ్రూపుల సహాయంతో యూనస్ ప్రభుత్వ నియంత్రణ చేజిక్కించుకున్నారని హసీనా ఆరోపించారు. యూనస్ ఉగ్రవాదుల సాయంతో, అంతర్జాతీయ నిషేధించిన వారితో కలిసి అధికారాన్ని చేజిక్కించు కున్నారని ఆమె దుయ్యబట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ ఉగ్రవాద రాజ్యాంగా ఉందని అన్నారు. ఈ తీవ్ర వాద నాయకుడికి గొప్ప బెంగాలీ దేశం యొక్క రాజ్యాంగాన్ని తాకే హక్కు లేదని, అతడిని ప్రజలు ఎన్ను కోలేదు, కాబట్టి అతను చట్టాలను ఎలా మార్చగలడు..? అవామీ లీగ్‌ని ఎలా నిషేధించగలడు అని హసీనా ప్రశ్నించారు.

# మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారు

మొదటి పేజి తరువాయి

ప్రధాని మోదీ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ప్రతినెలా చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ సనత్‌నగర్‌లోని లింగయ్య నగర్‌లో స్థానికులతో కలసి కిషన్‌రెడ్డి ఈ కార్యక్రమం వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించడంపై మహిళలకు శిక్షణ ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. వారు వ్యవసాయానికి సంబంధించిన వివిధ పనుల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గాంలో పాకిస్థాన్ ఉగ్ర వాదులు జరిపిన ఘటనలో 26మంది అమాయకులైన మన పర్యాటకులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మన సైనికులు పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపి నాశనం చేశారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో దేశవ్యాప్తంగా తీరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉగ్ర దాడులను సమర్థంగా ఎదుర్కో వడంలో మన సైనికులు ముందున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.మరోవైపు ప్రధాని మోదీ (ఆదివారం) జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో తెలంగాణలోని డ్రోన్‌దీదీలను ప్రశంసించారు. సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ తీసుకున్నారని చెప్పారు. పండ్ల తోటలపై పురుగు మందులు వాడటానికి డ్రోన్లను వినియోగించారని తెలిపారు. ఈ క్రమంలో డ్రోన్ దీదీలను స్కైవారియర్స్‌గా ప్రధాని మోదీ అభివర్ణించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ గుడ్ న్యూస్.. జూన్ 2న కీలక ప్రకటనలు!

హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఓ శుభవార్త అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగులకు మేలు చేకూర్చే కొన్ని కీలక ప్రకటనలు చేయవచ్చని సమాచారం. ఈ ప్రకటనల్లో భాగంగా ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ కరువు భత్యం (డీఏ)లలో ఒకదానిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అంతేకాకుండా, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఇతర బకాయిలు, పదవీ విరమణ చేసిన వారికి అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం అదే రోజు చెల్లించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేకంగా ఒక నూతన ఆరోగ్య పథకాన్ని కూడా ఆవిర్భావ దినోత్సవం నాడు ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ముగ్గురు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ కమిటీ పలుమార్లు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై వారి నుంచి వినతులు స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించింది. ఉద్యోగులు ప్రస్తావించిన కొన్ని ప్రధాన డిమాండ్లకు కమిటీ సానుకూలంగా స్పందించి, వాటిని ఆమోదించినట్లు ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఈ కమిటీ ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై, తమ సిఫార్సులతో కూడిన నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఈ నివేదికను ఆమోదించిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఈ అంశాలపై అధికారికంగా ప్రకటన విడుదల చేస్తారని ఉద్యోగ సంఘాల వర్గాలు చెబుతున్నాయి. జూన్ 2న వెలువడనున్న ఈ ప్రకటనల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం.. అది ఉగ్రవాదానికి అడ్డా..

హైదరాబాద్ : ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌ను ఒక 'విఫల రాజ్యం'గా అభివర్ణిస్తూ, ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని భారత అఖిలపక్ష బృందం నిన్న బహ్రెయిన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రముఖులతో జరిగిన సమావేశంలో ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత కొన్నేళ్లుగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద ముప్పు గురించి ప్రపంచానికి తెలియజేయడానికే మా ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి పంపింది. దురదృష్టవశాత్తు ఈ ఉగ్రవాదం వల్ల మేం ఎంతోమంది అమాయకుల ప్రాణాలను కోల్పోయాం. ఈ సమస్యకు పాకిస్థాన్ మూల కారణం. ఆ దేశం ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడం ఆపేంత వరకు ఈ సమస్య పరిష్కారం కాదు" అని ఒవైసీ స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఒవైసీ తెలిపారు.

"పాకిస్థాన్ మరోసారి ఇలాంటి దుస్సాహసానికి పాల్పడితే వారు ఊహించని దానికంటే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుంది" అని హెచ్చరించారు. తీవ్రమైన కవ్వింపు చర్యలు ఎదురైనా భారత్ ఎప్పుడూ సంయమనం పాటిస్తూ వస్తోందని గుర్తుచేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదం సృష్టిస్తున్న మానవ విషాదాన్ని ఆయన వివరించారు. "ఆరు రోజుల క్రితం పెళ్లయిన మహిళ ఏడో రోజే వితంతువుగా మారింది. రెండు నెలల క్రితం వివాహమైన మరో మహిళ కూడా ఈ దాడిలో తన భర్తను కోల్పోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. "మా రాజకీయ అభిప్రాయాలు వేరైనా, దేశ సమగ్రత విషయంలో మేమంతా ఒక్కటే. ఈ విషయాన్ని మా పొరుగు దేశం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి" అని ఒవైసీ అన్నారు. భారతదేశానికి తన పౌరులనే కాకుండా, దేశంలో నివసించే ప్రతి ఒక్కరి భద్రతను కాపాడటానికి కావలసిన శక్తిసామర్థ్యాలున్నాయని ఒవైసీ నొక్కిచెప్పారు.

"పాకిస్థాన్ లాంటి విఫల రాజ్యం నుంచి వస్తున్న అన్ని రకాల ముప్పులను మన వాయు రక్షణ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయి" అని ఆయన తెలిపారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులను అరికట్టేందుకు అంతర్జాతీయ సహకారం చాలా అవసరమని ఒవైసీ పేర్కొన్నారు. బైజయంత్ పాండా నేతృత్వంలోని ఈ ప్రతినిధి బృందంలో ఒవైసీతో పాటు గులాం నబీ ఆజాద్, బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, ఫాంగ్నాన్ కొన్యాక్, ఎన్‌జేపీ ఎంపీ రేఖా శర్మ, ఎంపీ సత్నామ్ సింగ్ సంధు, రాయబారి హర్ష్ ష్రింగ్లా తదితరులు ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ స్పందన, సీమాంతర ఉగ్రవాదంపై దేశం సాగిస్తున్న పోరాటం గురించి అంతర్జాతీయ భాగస్వాములకు వివరించడమే ఈ బృందం పర్యటన ముఖ్య ఉద్దేశం. ఈ బృందం సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాల్లో పర్యటించనుంది. ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని స్పష్టం చేయడం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడం ఈ పర్యటన లక్ష్యాల్లో భాగం.

# ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది



మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోదీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా మన సైన్యం ఉగ్రవాద స్థావరాలను ధ్వసం చేయడలో అద్భుతమైన పరాక్రమం ప్రదర్శించి దేశాన్ని ఉన్నతంగా నిలిపిందన్నారు.

ఆపరేషన్ సిందూర్ సైనిక మిషన్ కాదు: పీఎం మోదీ

ఉగ్రవాద వ్యతిరేక పోరాటంగా మనం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే కేవలం ఒక సైనిక మిషన్ కాదని, అది మన సంకల్పం, ధైర్యానికి ప్రతీక అని, మారుతున్న భారత దేశ ముఖచిత్రమని ప్రధాన మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశమంతటా భక్తిభావం నింపిందని, జాతీయజెండాలతో సైన్యానికి అభినందనలు తెలియచేయడానికి పల్లెల నుంచి మహానగరాల వరకు కదలి వచ్చాయని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ తో యువతలో దేశభక్తి

ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసిందని, సైన్యంలో వాలంటీర్లుగా చేరేందుకు ఎందరో యువకులు ముందుకు వచ్చారని అన్నారు. ఇక మావోయిస్టులపై ప్రభుత్వం చేస్తున్న యుద్ధం గురించి మాట్లాడిన ప్రధాని మోదీ మావోయిస్టుల ప్రభావంతో చాలా గ్రామాలు బస్సు సదుపాయానికి దూరంగా ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని ప్రధాన మంత్రి చెప్పారు.

మావోయిస్ట్ ప్రభావిత గ్రామానికి తొలిసారిగా బస్సు

మావోయిజానికి వ్యతిరేక సామూహిక పోరాటంతో అలాంటి ప్రాంతాలకు కూడ ప్రాథమిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయంటూ, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కాటేఝరి గ్రామాన్ని ఉదహరించారు. అ ఊరికి మొదటిసారిగా చేరుకున్న బస్సుకు స్థానికులు డప్పులతో స్వాగతం పలికారని చెప్పారు. బస్సు రాకతో తమ జీవితం సుఖవంతంగా సాగుతుందని గ్రామస్తులు చెబుతున్నారని అన్నారు.

డ్రోన్ దీదీలు స్కై వారియర్స్

ఇక ప్రధాని మోదీ గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా మారి వ్యవసాయంలో నూతన విప్లవాన్ని తీసుకువస్తున్నారని, తెలంగాణాలోని సంగారెడ్డి మహిళలు అందుకు నిదర్శనమని అన్నారు. సంకల్పానికి సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపించారని అన్నారు. ఆ మహిళలు డ్రోన్ ల సహాయంతో 50 ఎకరాల విస్తీర్ణంలో మందుల పిచికారీ పనిని నిర్వహించారు. వారు డ్రోన్ ఆపరేటర్లుగానే కాక స్కై వారియర్స్ గా గుర్తింపు పొందారని అభినందించారు.

యోగా దినోత్సవంపై ప్రధాని మోదీ

వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని యోగా జీవన విధానాన్ని మారుస్తుందని, ఇప్పటిదాకా యోగాకు దూరంగా ఉన్నవారు దానికి అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల క్రితం 2015 జూన్ 21న ప్రారంభమైన యోగా దినోత్సవం ఎంతో ఆదరణ పొందుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించిందని, విశాఖపట్నంలో జరిగే 'యోగదినోత్సవం'లో పాల్గొనే అవకాశం తమకు లభిస్తోందని ప్రధాన మంత్రి వెల్లడించారు.

ఆయుర్వేదంపై ప్రధాని మోదీ చెప్పిందిదే

యోగాతో పాటు ఆయుర్వేదాన్ని మరింత అభివృద్ధి చేయవలసి ఉందని ప్రధాని మంత్రి అన్నారు. ఈ నెల 24 న దీనిపై ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టర్ జనరల్ తులసీభాయ్ సమక్షంలో అవగాహన పత్రాలపై సంతకాలు జరిగాయని గుర్తు చేశారు. దీంతో ఆయుష్ ప్రపంచ వ్యాప్తంగా మరింత మందికి చేరేందుకు వీలువుతుందని అన్నారు. ఇంకా ఎన్నో ఆసక్తికర అంశాలను ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏపీలో జగన్, షర్మిల.. తెలంగాణలో కేటీఆర్, కవిత సీన్లు ఒక్కటే..!

మొదటి పేజి తరువాయి

మొన్న వైఎ స్సార్ కుటుంబం.. ఇపుడు కేసీఆర్ కుటుంబం.. అన్నల పైకి చెల్లెలను ఉసి గోల్పడంలో కాంగ్రెస్ కీల కంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ కు వ్యతిరేకత మొదలైందని.. రేవంత్ బీద అరుపులు అరుస్తున్నారని విమర్శించారు. ప్రజలలో ఉన్న వ్యతిరేకతను.. మళ్లించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ పుట్టి మునిగిపోయిందని.. దేశంలో బీజేపీ వెలిగిపోతోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. "తెలంగాణలో బీజేపీ బలపడింది.. భవిష్యత్ లో అధికారంలోకి కూడా రానుంది. కవిత లేఖ రాసింది వాస్తవమే.. కవిత కేసీఆర్ ను కలిసే పరిస్థితి లేదా? కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కేటీఆర్ ను సవాలు చేస్తున్నట్టుగానే కవిత సవాలు అర్థం అవుతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించను అని చెప్ప కనే చెపుతోంది. అన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమే లేఖాస్త్రం. కవిత సామాజిక తెలంగాణ గురించి మా ట్లా డటం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉంది. భారత దేశం ఆర్థికంగా అత్యంత బలోపేతంగా నిలు స్తోంది. భారత దేశం 4 వ ఆర్థిక అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందింది. భారత్ జపాన్‌ను అధిగమి ంచింది. మోడీ నాయకత్వానికి తార్కాణం. వికసిత భారత్ కూడా కచ్చితంగా సిద్ధిస్తుంది." అని వ్యాఖ్యానించారు.

# ఎన్టీఆర్ నుండి చంద్రబాబు వరకు.. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు!

మొదటి పేజి తరువాయి

రాయలసీమ ప్రజల నుండి ఎటువంటి స్పందన వచ్చిందో, మరల ఇప్పుడు 2024 ఎన్నికల్లో అదే స్థాయిలో ఆదరణ వచ్చిందన్నారు. ఇరిగేషన్ రంగంలో తెలుగు గంగ, జిఎన్ఎస్ఎస్, హంద్రీనీవా, హెచ్ఎల్ సి ఇలా ఎన్నో ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే నిర్మించామన్నారు. రాష్ట్రంలో మిగతా ప్రాంతాల కంటే రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకే అత్యధికంగా బడ్జెట్లో రూ.3240 కోట్లు సీఎం కేటాయించారని మంత్రి నిమ్మల చెప్పుకోచ్చాడు. రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ%ॐ% 'అన్నమయ్య ప్రాజెక్టు తక్కువ నిర్మాణంతో రూపొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈలోపు వాస్తవ పరిస్థితిని అధికారులతో చర్చిస్తున్నాం. డ్యామ్ నిర్మాణం పూర్తి అయ్యేలోపు రైతుల సూచనల మేరకు లిఫ్ట్ ద్వారా కెనాల్స్ ద్వారా మీరు సరఫరా చేసేందుకు ప్రయత్నం చేస్తాం. గత పాలకుల ఇసుక దోపిడీ, లూటీ వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. 41 మంది చనిపోతే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కనీసం పరామర్శించలేదు. అన్నమయ్య డ్యామ్ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నాం' అని అన్నారు. 'నాడు ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తరువాత రాయలసీమ ప్రజల నుండి ఎటువంటి స్పందన వచ్చిందో, మరల ఇప్పుడు 2024 ఎన్నికల్లో అదే స్థాయిలో ఆదరణ వచ్చింది. ఎన్టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వరకు రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇరిగేషన్ రంగంలో తెలుగు గంగ, జిఎన్ఎస్ఎస్, హంద్రీనీవా, హెచ్ఎల్సి ఇలా ఎన్నో ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే నిర్మించాం. ఈ ఏడాది సీజన్ మొదలయ్యేలోగా హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో మిగతా ప్రాంతాలకంటే రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకే అత్యధికంగా బడ్జెట్లో రూ.3240 కోట్లు కేటాయించారు చంద్రబాబు. ఒంటిమిట్ట భూ కబ్జాదారులను కఠినంగా శిక్షిస్తాం' అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పుకొచ్చారు.

# భారత్‌లో మళ్లీ కరోనా కేసులు.. అత్యధికంగా ఈ రాష్ట్రంలోనే నమోదు!



న్యూఢిల్లీ : భారత్‌లో మళ్లీ కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. కరోనాతో మహారాష్ట్రలోని థానేలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందారు. ఇక, బెంగళూరులో 84 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. అయితే.. మృతి చెందిన ఇద్దరికీ ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. కరోనా సోకిన వారిలో ప్రధానంగా జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం, గొంతు నొప్పి, తల నొప్పి, అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్న వాళ్లు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో అత్యధిక కరోనా కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లోనూ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని థానేలో కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 18 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేరళలో 273 కరోనా యాక్టివ్ కేసులు, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56, ఢిల్లీలో 23, కర్ణాటకలో 36 యాక్టివ్ కేసులు నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు.

## జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

మొదటి పేజి తరువాయి

ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ ఫీలవుతున్నారు. భారతదేశం ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని నీతి అయోగ్ ప్రకటించింది. నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : నీతి అయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యమ్ ఈ మేరకు తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మనకంటే అమెరికా, చైనా, జర్మనీలు మాత్రమే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని ఇప్పుడు మనం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ప్రణాళికను కొనసాగిస్తూ ఇదే విధంగా రెండున్నర, మూడు ఏళ్లలోపు ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సత్తా చాటుతున్న భారత్ : 2010 సంవత్సరంలో భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో పదవ స్థానంలో ఉందని, 2019 నాటికి బ్రిటన్ వెనక్కి నెట్టి ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆయన వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు స్థానాలు పైకి ఎగబాకి భారత్ తన సత్తా చాటింది అని పేర్కొన్నారు. శరవేగంగా భారత్ ఆర్థిక అభివృద్ధి : 2026 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ అంచనాలు దాదాపు 4187.017 డాలర్లకు చేరుకుంటుందని ఇప్పటికే %ఐఎంఎఫ్% వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ ఏప్రిల్ ఎడిషన్ నివేదిక ఒక అంచనా వేసింది. ఇక వచ్చే రెండేళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆ నివేదికలో పేర్కొంది. 2025 సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం 2026లో 6.3 శాతం వృద్ధి నమోదు చేస్తాయని అంచనా ఉంది. జపాన్ ను ఓవర్ టేక్ చేసిన భారత్ : భారత ఆర్థిక అభివృద్ధికి భారతదేశ జనాభా ఎంతగానో దోహదపడుతున్నట్టు నీతి అయోగ్ సీఈఓ వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారతదేశం మారిందని, 30 సంవత్సరాల కాలంలో భారత్ ఆర్థికంగా ప్రగతి సాధించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి జపాన్ దేశాన్ని ఓవర్ టేక్ చేసి భారత్ శరవేగంగా దూసుకుపోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది.

# ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం.. విజయసాయి రెడ్డి టీడీపీ కీలక నేతతో నిజంగానే భేటీ అయ్యారా?

మొదటి పేజి తరువాయి

దర్యాప్తు బృందం దూకుడుగా వెళ్తోంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో కీలక వ్యవహరించిన నాయకులు, అధికారులను ప్రశ్నించింది. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి సహా మరికొందరిని అరెస్టు చేసింది. అంతకుముందు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. తాజాగా విజయసాయికి సంబంధించి సంచలన విషయం టాక్ ఆఫ్ ది ఏపీగా మారింది. టీడీ జనార్ధన్‌తో భేటీ.. లిక్కర్ స్కామ్ కేసులో సిట్ విచారణకు హాజరు కాబోయే ముందు రోజు సాయంత్రం.. విజయసాయి రెడ్డి తెలుగుదేశం పార్టీ కీలక నేత టీడీ జనార్ధన్‌ను కలిసినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. టీడీ జనార్ధన్, విజయసాయి రెడ్డి ఒకరి వెంట ఒకరు.. ఒక ఇంట్లోకి వెళ్లడం, ఆ తర్వాత ఎవరికి వారుగా బయటకు వచ్చి వేర్వేరు కార్లలో వెళ్లడానికి సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 45 నిమిషాల పాటు సమావేశం.. మార్చి 11 సాయంత్రం 5:49 గంటలకు విజయసాయి రెడ్డి.. తాడేపల్లిలోని పార్క్ విల్లేలో.. విల్లా నెం. 27లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విల్లా ప్రముఖ నిర్మాత ఆది శేషగిరిరావుదని సమాచారం. విజయసాయి రెడ్డి లోపలికి వెళ్లిన కొద్ది సేపటికి.. టీడీ జనార్ధన్ అదే విల్లాలోకి వెళ్లారు. సుమారు 45 నిమిషాల పాటు వారిద్దరూ ఆ ఇంట్లోనే భేటీ అయినట్టు ప్రచారం జరుగుతోంది. సాయంత్రం 6:50 గంటలకు విజయసాయి రెడ్డి బయ టకు రాగా.. ఆ వెంటనే జనార్ధన్ కూడా విల్లా నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీ అంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. భేటీపై అనుమానాలు.. లిక్కర్ స్కామ్ కేసు విచారణకు హాజరు కావడానికి కొన్ని గంటలు ముందు ఈ భేటీ జరగడం పలు అనుమానాలకు దారితీస్తోందని.. వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ భేటీ జరిగిన కొన్ని గంటలు తరువాత.. విజయసాయి రెడ్డి సీఐడీ విచా రణకు హాజరైనట్టు తెలుస్తోంది. విచారణ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

# నేను ప్రభుత్వానికి అనుకూలంగా కాదు.. ప్రతిపక్షానికి పనిచేస్తున్నాను.. శశిథరూర్ స్పష్టీకరణ

మొదటి పేజి తరువాయి

పాక్ ఉగ్రకుట్రలను ప్రపంచదేశాలకు తెలిపేందుకు భారత దౌత్య బృందం విదేశాల్లో పర్యటిస్తుంది. కాగా.. శశిథరూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అమెరికాకు వెళ్లింది. ఈక్రమంలోనే న్యూయార్క్‌లోని 9/11 మెమోరియల్‌ను బృందం సందర్శించింది. ఈ సందర్భంగా శశిథరూర్ మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకొన్న చర్యలను ఆయన తెలిపారు. శశిథరూర్ మాట్లాడుతూ.. "పహెల్గాంలో మతం ఆధారంగా పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడితో భారత్‌లో మతపరమైన అల్లర్లు సృష్టించాలనేది వారి ప్రయత్నంగా తెలుస్తోంది. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థ ఈ దారుణానికి పాల్పడింది. అది లష్కరే తోయిబా అనుబంధ సంస్థ. దీన్ని ఉగ్రసంస్థగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి భారత్ ఇప్పటికే కోరింది." అని అన్నారు.ప్రభుత్వం కోసం పనిచేయట్లేదు.. తాను ప్రభుత్వం కోసం పనిచేయట్లేదని శశిథరూర్ చెప్పుకొచ్చారు. "నేను ప్రభుత్వం కోసం పనిచేయట్లేదు. ప్రభుత్వంలో కాకుండా.. ప్రతిపక్ష పార్టీలో ఉన్నాను. ఈ దాడి తర్వాత పాక్‌పై తీసుకోవాల్సిన అంశాలను ఉద్దేశిస్తూ నేను ఒక వ్యాసం రాశాను. సరిగ్గ రెండ్రోజుల తర్వాత భారత బలగాలు పాక్‌ను బలంగా, తెలివితో దెబ్బతీశాయి. పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై భారత బలగాలు కచ్చితమైన దాడులు చేసి.. వాటిని ధ్వంసం చేశాయి. మేం ఉగ్రస్థావరాలపై దాడి చేస్తే.. పాక్ సైన్యం స్పందించింది. మాపై ప్రతిదాడులకు దిగింది. వాటిని సమర్థమంతంగా తిప్పికొట్టాం. ఈ ఆపరేషన్‌తో ఉగ్రచర్యలను భారత్ సహించదనే గట్టి సందేశం ఇచ్చింది. ఇది పహెల్గాం దాడికి ప్రతిస్పందన మాత్రమే తప్ప.. పాక్‌తో యుద్ధం చేయాలనేది మా ఉద్దేశం కాదు. దాన్ని మేము కోరుకోవడం లేదు. దేశ ప్రజల రక్షణే మాకు ముఖ్యం" అని శశిథరూర్ పేర్కొన్నారు.

# మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి

మొదటి పేజి తరువాయి




జరిగిన అవమానం తనను తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్ నేత ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలన్నారు. మిల్లా ఆరోపణలపై విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సుదీర్ఘ పోస్టు పెట్టారు. "మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ వేదికలపై స్త్రీ ద్వేషపూరిత మనస్తత్వాన్ని గట్టిగా ఎదుర్కోవడానికి చాలా ధైర్యం అవసరం. మిల్లా మ్యాగీ చాలా బలమైన మహిళ. తెలంగాణలో మీరు ఇలాంటి అవమానపూరిత పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినందుకు నేను నిజంగా చింతిస్తున్నాను. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది. మేము వారిని గౌరవిస్తాము, వృద్ధికి సమాన అవకాశాలను అందిస్తాము. మా భూమి నుంచి వచ్చిన గొప్ప నాయకులలో రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి కొందరు మహిళలు ఉన్నారు. ఒక ఆడపిల్ల తండ్రిగా, ఏ స్త్రీ లేదా అమ్మాయి ఇలాంటి భయంకరమైన అనుభవాలను ఎదుర్కోకూడదని నేను కోరుకుంటున్నాను. మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నాను" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. కాగా, మిల్లా మాగీ వ్యక్తిగత మరియు నైతిక కారణాలను చూపుతూ పోటీల నుండి వైదొలగి, స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆమె బ్రిటిష్ టాబ్లాయిడ్ 'ది సన్'తో మాట్లాడుతూ, పోటీల వాతావరణం "ఒక లక్ష్యంతో కూడిన అందం" అనే తన అంచనాలకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. రోజంతా, అల్పాహారం సమయంలో కూడా మేకప్‌తో, బాల్ గౌన్‌లలోనే ఉండాలని పోటీదారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. "పోటీలకు ఆర్థిక సహాయం చేసినందుకు కృతజ్ఞతగా మధ్యవయస్కులైన పురుషులతో సోషల్ కలవాలని కోరినప్పుడు అసలు సమస్య మొదలైంది" అని 'ది సన్' పత్రికకు మిల్లా మాగీ వివరించినట్లు సమాచారం. అయితే, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ మరియు సీఈఓ జూలియా మోర్లీ ఈ ఆరోపణలను ఖండించారు. మిల్లా మాగీ తల్లి అనారోగ్యం కారణంగా కుటుంబ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, అందుకే పోటీ నుండి వైదొలగాలని అభ్యర్థించారని తెలిపారు. "మిల్లా పరిస్థితికి మేము సానుభూతితో స్పందించి, పోటీదారురాలి శ్రేయస్సు మరియు ఆమె కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ వెంటనే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపడానికి ఏర్పాట్లు చేశాం. దురదృష్టవశాత్తు, కొన్ని యూకే మీడియా సంస్థలు మిల్లా మాగీ భారతదేశంలో తన అనుభవం గురించి చేసినట్లుగా తప్పుడు మరియు పరువు నష్టం కలిగించే ప్రకటనలను ప్రచురించినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి మరియు మాతో ఆమె గడిపిన వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయి" అని జూలియా మోర్లీ ఒక ప్రకటనలో తెలిపారు.

### కవిత లేఖతో కాంగ్రెస్‌కి వచ్చే

# నష్టం ఏం లేదు.

### బలంగా లేని పార్టీ బీజేపీ :జగ్గారెడ్డి

### కేసీఆర్‌కి రాష్ట్ర విభజన అంశంతో ఓటేశారు

### కాంగ్రెస్ కి పాలన చూసి ఓటేస్తారు ప్రజలు

### కవిత కొత్త పార్టీ అనే చర్చ నడుస్తుంది



సూర్య న్యూస్( మే 25: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసీఆర్‌కు రాసిన ఆరు పేజీల లేఖపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ కు వచ్చిన నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 64 సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో బలంగా ఉందని.. అలాంటి లేఖలు వంద పుట్టుకొచ్చినా తమకు జరిగే ఏమీ లేదని, ఈ గొడవ వల్ల గులాబీ పార్టీకే తీరని నష్టమని స్పష్టం చేశారు. కవిత లేఖ బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబ పంచాయితీని బయటపెట్టిందన్నారు. కేటీఆర్ ఉండగా వారసత్వం కూతురుకు ఎలా దక్కుతుందని వ్యాఖ్యానించారు. ఈ లేఖ ద్వారా బీఆర్ఎస్ - బీజేపీతో రహస్య ఒప్పందాలు బయటపడ్డాయని ఆరోపించారు. ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణాన్ని కల్పించిందని జగ్గారెడ్డి నొక్కిచెప్పారు.

### గొల్ల కురుమలకు కులదైవం బీరప్ప

## ప్రత్యేక పూజలు నిర్వహించిన

### మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి



యాచారం సూర్య న్యూస్( మే 25:. మండల పరిధిలో మల్కిజ్ గ్రామంలో శ్రీశ్రీ అఖిలాండ బీరప్ప కామరాతి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు కులదైవంగా భావించి బీరప్ప పండుగను ఘనంగా నిర్వహిస్తారు. సుమారు 5,7,9 సంవత్సరాల ఒక్కసారి ఈ పండుగను వివిధ గ్రామాల నుండి బంధువులతో, మిత్రులతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కర్నాటి రమేష్ గౌడ్, పాచ భాష, మాజీ ఎంపిటిసి దేరంగుల శారద శంకర్, భి ఆర్ఎస్ పార్టీ బోడ అబ్బయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరారం వెంకట్ రెడ్డి, చీర శేఖర్, గొల్ల కురుమ సంగం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



### పేదోడి సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి తోనే సాధ్యం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూరు, సూర్య టుడే (మే 25): పేదోడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండాగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేదవాడి సొంతింటి కల ఊహ గానే మిగల కుండా అర్హులైన ప్రతీ కుటుంబానికి పక్కా ఇంటి నిర్మాణం చేపట్టాలని బాధ్యతగా భావించిన సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని అన్నారు.త్వరలోనే మరి కొన్ని ఇండ్లు అదనంగా తీసుకొచ్చి అర్హులైన పేదలకు కానుకగా అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ,మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి,జంగ నరసింహ,కౌన్సిలర్స్ హేమ దేవేందర్ ముదిరాజ్,కమ్మరి జయమ్మ జనార్దన్ చారి,షాద్ నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్,మాజీ సర్పంచులు జగన్,అంబటి ప్రభాకర్,కొమ్ము కృష్ణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి సిద్ధార్థ రెడ్డి,ఇందూరి శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి కుమారస్వామి గౌడ్, చంద్రపాల్ రెడ్డి,యువ నాయకుడు నవీన్ చారి, చిల్కమర్రి నరసింహ, పీర్లగూడెం మహేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, బాలరాజు గౌడ్,తుప్పర రమేష్,గోవింద్ నాయక్,పెంటయ్య యాదవ్,నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




ఎల్బీనగర్ సాయి సూర్య : చంపాపేట్ లోని త్రివేణి ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కర్మన్ ఘాట్ లోని హోటల్ సింధూరలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో సభా స్థలానికి ఆహ్వానించారు. ఉపాధ్యాయులకు పుష్ప గుచ్చాలు అందజేస్తూ వేదిక పైకి సగౌరవంగా తీసుకెళ్లారు. అనంతరంనాటి త్రివేణి పాఠశాల చైర్మన్ జిట్టా సురేందర్ రెడ్డి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, మెమంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోప్రిన్సిపాల్ కె.గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, కౌసల్య, వింజమూర్ ఈశ్వర్, వజత్ పతి, రఘు, లక్ష్మణ చారి, పూర్వ విద్యార్థులు సామ మహేందర్ రెడ్డి,అనిల్, సర్వేష్, సందీప్,కార్తీక్, రాధిక,సుజాత,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీల్లో ఆరోపణలపై విచారణ

### మిల్లా మాగీ పోటీల నిర్వహణపై సంచలన ఆరోపణలు

### విచారణకు ఆదేశించిన తెలంగాణ ప్రభుత్వం

### ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలు

### 72వ పోటీలను హైదరాబాద్ లో నిర్వహణ




సాయి సూర్య- తెలంగాణ బ్యూరో: ప్రపంచ సుందరీ పోటీలు అంటే...ఇప్పుడే కాదు...ఎప్పుడూ యువతలో క్రేజ్. వ్యాపారస్థులు, పెట్టుబడిదారులు మిస్ వరల్డ్ పోటీలకు పోటెత్తుతారు. అందాల తారల, హొయలు, సౌందర్యానికి మంత్రముగ్దులవుతారు. మిస్ వరల్డ్ పోటీలంటే ఇదే కాదు... దాని వెనుక సామాజిక అంశాలు కూడా ఉంటాయి. ఐతే 72వ మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణలో జరగడం గర్వకారణం. కానీ దారుణమైన ఆరోపణలు రావడమే...ఇబ్బందికరం. తెలంగాణలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయాలు ప్రపంచానికి చాటిచెప్పే అద్భుత అవకాశం కలిగింది. ప్రపంచ దేశాల సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మిస్ వరల్డ్ టైటిల్ కోసం పోటీ పడుతున్నారు. అలాగే భారత్ లోని విభిన్న సంస్కృతి సంప్రదాయాలను ఆస్వాధించే అవకాశం కలిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఈవెంట్ నిర్వహిస్తోంది. పర్యాటక ప్రాంతాలను సందర్శింపజేయడం, దాని ద్వారా టూరిజం ప్రోత్సహించడం, బ్రాండ్ హైదరాబాద్ ను ప్రపంచ దేశాలకు తెలియజేసే ప్రయత్నం చేసింది. ఇదంతా బాగానే ఉన్నా



తాజాగా మిస్ వరల్డ్ పోటీల నుంచి తప్పుకున్న సుందరీమణి

ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మిస్ వరల్డ్ పోటీలు గతంలో ముంబైలో జరిగాయి. ఈ ఈవెంట్ నిర్వహించే అద్భుత అవకాశం కలిగింది. అందుకు తగ్గట్టుగానే తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. కానీ ఇలాంటి ఆరోపణలు విచారకరం. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ హైదరాబాద్ లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించడంలో ఎంతో ఒత్తిడికి గురయ్యా అంటూ కామెంట్ చేశారు. దీంతో దీనిపై రాజకీయంగా చర్చకు తెరలేచింది. దేశ వ్యాప్తంగా కూడా సంచలనంగా మారింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం



విచారణకు ఆదేశించింది. మిల్లా మాగీ ఆరోపణలపై విచారణ చేయాలని సూచించింది. ఇందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి షికా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. పోటీల తీరు, నిర్వహణ ఇబ్బందులు వంటివి అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్ లో ఎవరెవరు ఉన్నారో తెలుసుకుని విచారించనుంది. ప్రభుత్వం విచారణకు ఆదేశించడం వరకు సరే. కానీ ఇలాంటి ఆరోపణలు ఏ మాత్రం మంచివి కావనే భావన అందరిలో కలుగుతోంది. పోటీలను హుందాగా నిర్వహించి...పేరు ప్రతిష్టలు పెంచేవిలా చేసుంటే...తెలంగాణ ప్రపంచ దేశాల్లో గుర్తింపు లభించేది అంటున్నారు. ఇప్పటికే పోటీదారుల కాళ్లు కడిగించారని ఆరోపణలతో కొంత డ్యామెజ్, ఇప్పుడు మరింత డ్యామేజ్ జరిగింది. ఈ డ్యామెజ్ కంట్రోల్ ఎలా చేస్తారో చూడాలి.

# ఉత్తమ పాలనా విధానాలు ఆచరించండి




### వికసిత భారత్‌కు అవి సోపానాలు

### కులగణనతో వృద్ధి పథంలోకి బడుగులు

### కుల రాజకీయాలపై నమ్మకం లేదు

### ఎన్డీయే సీఎంల సమావేశంలో మోదీ

### ప్రధాని నేతృత్వాన్ని కొనియాడిన ముఖ్యమంత్రులు

దిల్లీ: దేశంలో ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాలు ఉత్తమ పాలనా విధానాలను ఆచరించి, వికసిత భారత్ లక్ష్యాలు సాకారమయ్యేందుకు దోహదపడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆదివారం దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి పక్షాలు ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ అభ్యాసాలపై చర్చకు సమావేశంలో ఎక్కువ సమయం కేటాయించారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు సహా సీఎంలు తమతమ రాష్ట్రాల్లో చేపట్టిన ఉత్తమ పాలనా విధానాలు, ప్రభావవంతమైన కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. వీటిని అధ్యయనం చేసి, ఇతర చోట్ల కూడా అమలు చేసేందుకు వీలుగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఎన్డీయే రాష్ట్రాలు సమన్వయంతో చేసే ప్రయత్నాలు.. వికసిత భారత్ లక్ష్యాలను సత్వరం చేరుకునేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలవారిని అభివృద్ధిపరమైన ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కులగణన ఓ ముందడుగు అవుతుందని, అయితే తమ ప్రభుత్వం కుల రాజకీయాలను నమ్మబోదని చెప్పారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి మాత్రం ప్రాధాన్యమిస్తామన్నారు. “రక్షణరంగంలో దేశం సాధించిన స్వయం సమృద్ధికి ఆపరేషన్ సిందూర్ విజయం ఒక తార్కాణం. ఇలాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ఎక్కడా హద్దు మీరొద్దు. ఈ ఆపరేషన్లో సైనిక బలగాలు ఎంతో ధైర్యసాహసాలతో పరాక్రమాన్ని ప్రదర్శించాయి. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను వేగంగా తీర్చిదిద్దడం, శక్తిమంతమైన.. స్వయం సమృద్ధ దేశంగా తయారు చేయడం మన లక్ష్యం” అని మోదీ చెప్పారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఆపరేషన్ సిందూర్

‘ఆపరేషన్ సిందూర్’ వల్ల భారతీయుల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించిందని పేర్కొంటూ ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఉగ్రవాదులకు బుద్ధిచెప్పడంలో ప్రధాని మోదీ సాహసోపేత నాయకత్వాన్ని కనపరిచారని కొనియాడింది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. సైనిక దళాలకు మోదీ అన్నివేళలా మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొంది. ఉగ్రవాదులకు, వారి ప్రాయోజకులకు భారత సైన్యం దీటైన సమాధానం ఇచ్చిందని కొనియాడింది. సమావేశంలో ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డా తదితరులు పాల్గొన్నారు. కుప్పంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి రాలేకపోయారు. ఆయన మినహా 20 మంది సీఎంలు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సహా 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సమావేశం నివాళులర్పించింది. దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ మరో తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది. పాల్గొన్న ముఖ్యమంత్రుల్లో హిమంత బిశ్వశర్మ (అస్సాం), యోగి ఆదిత్యనాథ్ (యూపీ), రేఖా గుప్తా (దిల్లీ), దేవేంద్ర ఫడణవీస్ (మహారాష్ట్ర), నీతీశ్ కుమార్ (బిహార్), భజన్‌లాల్ శర్మ (రాజస్థాన్), నెఫ్యూ రియో (నాగాలాండ్), కాన్రాడ్ సంగ్మా (మేఘాలయ), మాణిక్ సాహా (త్రిపుర), పెమా ఖండూ (అరుణాచల్‌ప్రదేశ్), మోహన్‌చరణ మాఝి (ఒడిశా), నాయబ్ సింగ్ సైనీ (హరియాణా), పుష్కర్ సింగ్ ధామీ (ఉత్తరాఖండ్), ప్రమోద్ సావంత్ (గోవా), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), భూపేంద్ర పటేల్ (గుజరాత్) తదితరులు ఉన్నారు.

ఆ అనుభవాలు వినడం అద్భుతంగా ఉంది -మోదీ

సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సీఎంలతో కలిసి తీసుకున్న ఫొటోను, చర్చించిన అంశాల సారాంశాన్ని ‘ఎక్స్’ వేదికగా పంచుకున్నారు. “అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలన వ్యవస్థల్ని బలోపేతం చేయడం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు, విభిన్న రంగాల్లో ఉత్తమ పద్ధతులను ఆయా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ అనుభవాలను వినడం చాలా అద్భుతంగా ఉంది” అని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని సూచించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, యువత సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మించడంపై ఈ సమావేశంలో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

## మున్సిపల్ శాఖపై ప్రైవేటు వ్యక్తి పెత్తనం?

### హెచ్ఎండీఏ, పట్టణాభివృద్ధి విభాగాల్లో కీలక ఫైళ్లపై ‘అజ్ఞాత అధికారి’ ఆదేశాలు!




హైదరాబాద్, సాయి సూర్య : మున్సిపల్ శాఖలో ఓ ప్రైవేటు వ్యక్తి పెత్తనం చెలాయిస్తున్నాడనే ఆరోపణలు ఉద్యోగుల్లో కలకలం రేపుతున్నాయి. సంబంధిత శాఖలకు అధికారికంగా ఏ సంబంధమూ లేకపోయినా, ఫైళ్లపై నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఆదేశాలు జారీ చేస్తున్నాడంటూ చర్చలు జరుగుతున్నాయి. తాజాగా వేసవి సెలవుల పేరిట విదేశాలకు వెళ్లిన ఆయన, “తాను తిరిగివచ్చే వరకూ కీలకమైన ఫైళ్లను ఆపేసి పెట్టాలి” అంటూ అధికారులకి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. దీంతో నాలుగైదు రోజులుగా హెచ్ఎండీఏ, ప్లానింగ్ విభాగాల్లో ఫైళ్ల క్లియరెన్స్ నిలిచిపోయింది. ఆయన హెచ్ఎండీఏ కార్యాలయానికి తరచూ వచ్చి, ప్లానింగ్ శాఖ ఫైళ్లను ప్రత్యేకంగా ఆరా తీస్తారని, భూమి మార్పిడి, అనుమతులపై స్వయంగా హస్తక్షేపం చేస్తారని వర్గాలు చెబుతున్నాయి. “మీ ఫైలు పరిశీలనలో ఉంది, కలిస్తే పనవుతుంది” అన్నట్టు సూచనలు ఇస్తున్నట్టు వినిపిస్తోంది. ఈయన ముఖ్యమంత్రి సన్నిహితుడని, ఆయన పేరుతో వ్యవహరిస్తున్నాడని కొందరంటుంటే, అసలు సీఎంకు ఈ వ్యవహారం తెలుసా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఆయన తిరిగి హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉండగా, అధికార యంత్రాంగం అప్పటివరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మా భూముల్లో ఎవరిని అడుగుపెట్ట నివ్వం

### రైతులు సాగు చేసుకుంటున్నా భూమిని ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం.

### -క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలించాలి:కందాల బలదే వరెడ్డి




తుర్కయంజాల్-సాయి సూర్య:తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి కోహెడ రెవెన్యూ పరిధిలోని 167/1లోని సుమారు 200 ఎకరాల భూమిని 90 ఏళు గా రైతులు సాగు చేసుకుం టున్నారు. సాగు సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తుందని , ఒకవేళ తమ భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదనికోహెడ గ్రామ ప్రజలు తేల్చి చెప్పారు. అప్పటి ప్రభుత్వం రైతులకు ఏక్ సాల్ పట్టాకూడా ఇచ్చిందన్నారు. తె లంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ భూములను ఓ కంపెనీకి ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు తిరగబడటంతో ఇన్నాళ్లు స్తబ్ధుగా ఉన్నారు.బీ జేపీ సీనియర్ నాయకులు కందాల బలదేవరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరి శీలించారు. తమ భూములు లాక్కోవద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కందాల బలదే వరెడ్డి మాట్లాడుతూ రైతులతో మాట్లాడకుండా ఏకపక్షంగా భూములను తీసు కుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూమికి భూమి ఇచ్చేటట్లు అయితే రైతులతో చర్చలకు రావాలని సూచించారు.సర్వే నెంబర్ 167/1లోని భూమిని ప్రభుత్వం తీసుకునేందుకు ప్రయత్ని స్తున్నట్లు తెలుస్తోందని తెలిపారు. అప్పటివరకు భూముల్లో ఎవరినీ అడుగుపెట్టనివ్వబోమన్నా రు. ఈ కార్యక్రమంలో గంగని శ్రీనివాస్ కురుమ, జూలు మల్లేశ్, పోచిగారి వెంకటేశ్, శీలం మా నయ్య, చిమ్ముల మల్లారెడ్డి, కందకట్ల తిరుమలరెడ్డి, యార కుమార్, కావలి రాములు, కావలి యాదగిరి తదితరులుపాల్గొన్నారు.



## కర్ణాటకలో కాంగ్రెస్ ఖతం..
## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీదే అధికారం..



**న్యూఢిల్లీ,:** రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ పాలన పట్ల కర్ణాటక ప్రజల్లో అసంతృప్తి పెరిగినట్లు తాజాగా సర్వేలో తేలింది. పీపుల్స్ పల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇప్పటికిప్పుడు కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే బీజేపీ ఘన విజయం సాధిస్తుందని సర్వే చెప్పింది. అయితే, ఇప్పటికీ సిద్ధరామయ్య రాష్ట్రంలో అత్యధిక మంది ఇష్టపడే ముఖ్యమంత్రి ఫేస్‌గా ఉన్నారని సర్వే చెప్పింది. మొత్తం, 10,481 మంది సర్వేలో ప్రతిస్పందించారు. సర్వే ప్రకారం, బీజేపీ పూర్తి మెజారిటీతో 136-159 సీట్లు సాధిస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 51 శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. కాంగ్రెస్‌కి 40.3 శాతం (2023లో 42.88శాతం) ఓట్లతో 53-82 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. జేడీఎస్ 5 శాతం ఓట్లతో 3-6 సీట్లకు మాత్రమే పరిమితమవుతుందని సర్వే చెప్పింది. కర్ణాటకలో మొత్తం 224 సీట్లు ఉన్నాయి, అధికారానికి మ్యాజిక్ ఫిగర్ 113 సీట్లు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో గత 20 ఏళ్ల నుంచి ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ మూడు సార్లు -2004, 2008, 2018లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, మ్యాజిక్ ఫిగర్ 113ని సాధించి ఎప్పుడూ అధికారాన్ని చేపట్టలేదు. ముఖ్యమంత్రిగా మాత్రం కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య 29.2 శాతం ఓటర్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నారు. మరో కాంగ్రెస్ నేత 10.7 శాతం ఓట్లతో డీకే శివకుమార్ రెండో ప్లేస్‌లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రులు బి.ఎస్. యడియూరప్ప (5.5 శాతం), బసవరాజ్ బొమ్మై (3.6 శాతం) మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర (5.2 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇదిలా ఉంటే, కర్ణాటక ప్రజలు ప్రధానిగా మరోసారి నరేంద్రమోడీ వైపే నిలిచారు. నరేంద్రమోడీకి 59 శాతం మంది సపోర్ట్ చేయగా, రాహుల్ గాంధీకి 17 శాతం, యోగి ఆదిత్యనాథ్‌కి 11 శాతం మంది ప్రతివాదులు మద్దతుగా నిలిచారు.

## వల్లభనేని వంశీ కస్టడీ పూర్తి..
## 20 కేజీలు తగ్గారని భార్య వెల్లడి..!



**అమరావతి,:** వల్లభనేని వంశీ రెండు రోజుల కస్టడీ పూర్తి అయింది.. బాపులపాడు నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నమోదైన కేసుకి సంబంధించి వంశీని రెండ్రోజుల పాటు పోలీసులు విచారించారు. వంశీని 30కిపైగా ప్రశ్నలు అడిగారు. నకిలీ ఇళ్ల పట్టాలను ఎక్కడ ఎవరు ఎందుకు తయారు చేసారని వంశీని పోలీసులు ప్రశ్నించారు. నకిలీ ఇళ్ల పట్టాల తయారీలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే విషయాల్ని అడిగారు. తనకు నకిలీ పట్టాలతో సంబంధం లేదని వంశీ సమాధానం చెప్పారు. వంశీ అస్వస్థతకు గురైన నేపథ్యంలో సరిగ్గా విచారణ చేయలేదని పోలీసులు చెబుతున్నారు. కస్టడీ అనంతరం వంశీని నూజివీడు కోర్టు నుంచి విజయవాడ సబ్ జైలుకి తరలించారు. ఈ సందర్భంగా వంశీ భార్య పంకజ శ్రీ మాట్లాడారు. “వంశీ తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సీ క్యాప్ తో మాత్రమే శ్వాస తీసుకునే పరిస్థితి లో ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం పూర్తి స్థాయిలో అందటం లేదు. ఎయిమ్స్ వంటి మెరుగైన ఆసుపత్రిలో వైద్యం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరాం. 105 కిలోల నుంచి 85 కిలోలకి బరువు తగ్గిపోయారు.” అని పేర్కొన్నారు.

## అధికారంలోకి రాగానే మాట మార్చేశారు..
### పవన్ కల్యాణ్‌పై పేర్నినాని ఫైర్..



**అమరావతి,:** జగన్ ప్రభుత్వంలో తక్కువ రేటుకే సినిమాలు చూడాలి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారని పేర్ని నాని గుర్తు చేశారు.. అప్పుడు ఇదే పవన్ కళ్యాణ్.. నోటికి వచ్చినట్లు మాట్లాడారన్నారు.. సినిమా మాది మా ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటామని గతంలో పవన్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. అప్పుడు ఏం మాట్లాడారు.. ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.. పవన్ అధికారంలో ఉంటే ఓ మాట.. ప్రతిపక్షంలో ఉంటే మరో మాట మాట్లాడటం సరికాదన్నారు. సినిమా వాళ్లకు గొడవలు జరుగుతున్న సమయంలో జైళ్లో వేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సినిమా ఫీల్డ్ ను ఉద్ధరిస్తారని ఆ శాఖ తీసుకున్న మంత్రి థియేటర్ యాజమాన్యాలపై విచారణకు ఆదేశించారని చెప్పారు.. ఇవి దివాలకోరు రాజకీయాలు కావా? అని నిలదీశారు. మీ చెప్పు చేతల్లో ఉన్న మంత్రితో బెదిరింపులు చేస్తారా? అని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఫైర్ అయ్యారు. జైళ్లలో వస్తామని బెదిరిస్తున్నారని.. రాబోయే ఫ్లాప్ సినిమా కోసం ఇంతలా చేయాలా? అని మండిపడ్డారు. గతంలో పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అందరికీ గుర్తున్నాయని.. సినిమా వాళ్ళను బెదిరించటానికి మీరు ఎవరు? అని ప్రశ్నించారు. అసలు వాళ్ళ సమస్య ఏంటో మీకు తెలుసా? అని అడిగారు. వైసీపీకి అంతక్రియలు చేస్తామని వ్యాఖ్యానించిన సోమిరెడ్డిపై పేర్ని నాని ఫైర్ అయ్యారు.అంత్యక్రియలు చేయటం సోమిరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని.. రాజకీయంగా చేరదీసిన ఎన్టీఆర్ కే వెన్నుపోటు పొడిచిన ఘనులు వీళ్ళని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవులు ఇవ్వలేదని ఎవరికి పడితే వాళ్లకు అంత్యక్రియలు చేయకండని సూచించారు. వాసంశెట్టి సుభాషే ఒక పిల్ల గాడిద అని తీవ్రంగా విమర్శించారు..

## దిక్కుతోచని స్థితిలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కి పరిమితమయ్యారు



**హైదరాబాద్, :** ఎమ్మెల్సీ కవిత మాజీ సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖ వ్యవహారం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలోనే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇంట్లో కుంపటి తట్టుకోలేక కేటీఆర్ సతమతం అవుతున్నాడని, ఎకు మేకై మరో పవర్ సెంటర్ రావడంతో మతిభ్రమించి, రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ మాట్లాడారని ఆయన మండిపడ్డారు. కవిత ఎపిసోడ్ ను డైవర్ట్ చేయడానికి కేటీఆర్, సీఎం రేవంత్ పై ఆరోపణలు చేశాడని, కేటీఆర్ ముందు ఇంట్లో రగులు నాకు ఇప్పటిని సరిపెట్టుకోవాలన్నారు మహేష్ గౌడ్. పది సంవత్సరాల టిఆర్ఎస్ తప్పిదాలను కవిత తప్పులను ఎత్తి చూపిందని, టీఆర్ఎస్ తప్పిదాలన్ని ప్రజలకు అర్థమవుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా..కాలేశ్వరం అవినీతిలో కేసీఆర్‌కు నోటీసులతో, కేటీఆర్ భయపడుతున్నాడని, బీఆర్ఎస్ కు, బీజేపీకి స్పష్టమైన అవగాహన ఉన్నట్లు కవిత వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయని, బిఆర్ఎస్ మూడు ముక్కలు కాబోతుందన్నారు మహేష గౌడ్. కవిత, కేటీఆర్ మధ్య పోటీ తీవ్రం కావడంతో అదును కోసం హరీష్ రావు ఎదురు చూస్తున్నారని, దిక్కుతోచని స్థితిలో కెసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారన్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలు ఎవరో ప్రజలకు తెలియాలని, పదేళ్ల అవినీతిలో పంపకాల్లో వచ్చిన తేడాతోనే, కవిత జెండా ఎగరవేసినట్లు అర్థమవుతుందన్నారు. భవిష్యత్తు తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

# నియంతలను తలదన్నిన నెతన్యాహు



నియంతల ఏలుబడిలో పౌరహక్కులకు తావు ఉండదు. మంచీ, మానవత్వానికి చోటు దొరకదు. నిరంకుశత్వానికే అక్కడ అగ్రతాంబూలం. కానీ, నేటి ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలను తలదన్నే దేశాలున్నాయంటే నమ్మశక్యం కాదు. అలాంటి దేశాల జాబితాలో అగ్రస్థానం ఇజ్రాయెల్ దేనంటే ఆశ్చర్యపోనక్కరలేదు. పేరుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న ఈ దేశంలో అధికార పీఠంపై కూర్చున్నది అక్షరాలా ఓ నియంత. ఆ పెద్దమనిషి పేరు బెంజమిన్ నెతన్యాహు. ఆయన నేతృత్వంలో గాజాపై గత 18 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండలో 52 వేల మందికి పైగా అసువులు బాశారు. లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారు. అయినా ఆయన యుద్ధకాంక్ష మాత్రం తీరలేదు సరికదా, రానురాను మరింత పెచ్చరిల్లుతోంది. గాజాపై 'పరిపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోనని ఇటీవల ఆయన చేసిన శపథమే ఇందుకు ఉదాహరణ. 'గాజాను మొత్తం స్వాధీనం చేసుకుంటాం. అక్కడ నెలకొన్న కరవు పరిస్థితులను నివారించవలసి ఉంది' అంటూ ఆయన తాజాగా చేసిన ప్రకటన గిచ్చి జోలపాడటమనే సామెతను గుర్తు చేయక మానదు. గాజాను ఇంతటి దుర్భర స్థితిలోకి నెట్టిన నెతన్యాహు ఇప్పుడు దానిని బాగు చేస్తామనడాన్ని చూసి ముక్కున వేలేసుకోనివారు ఉండరు. గాజాలో ప్రస్తుత పరిస్థితిని వర్ణించడానికి మాటలు చాలవు. ఎక్కడ చూసినా శిథిల భవనాలు, బక్కచిక్కిన మనుషులు. ఆకలి బాధను తట్టుకోలేక కళ్లముందే బిడ్డలు చనిపోతుంటే ఏడవడానికి కూడా ఓపికలేని మాతృమూర్తులను చూస్తే ఎవరికైనా గుండె చెరువుకాక మానదు. గాజాకు తక్షణ మానవతాసాయం అందకపోతే, రానున్న 48 గంటల్లో 14వేల మంది చిన్నారులు క్షుద్బాధతో చనిపోయే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిందంటే, అక్కడి పరిస్థితి ఎంత భీతావహంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ నెతన్యాహు మనసు మాత్రం కరగడం లేదు. గత కొన్ని నెలలుగా మానవతాసాయంపై ఉక్కుపాదం మోపిన ఆ పెద్దమనిషి, ఐక్యరాజ్య సమితి హెచ్చరికతోనూ దిగిరాకపోగా, పరిమితి సాయానికి మాత్రమే అనుమతినిస్తామనడం కరడుగట్టిన రాక్షసత్వానికి నిదర్శనం. హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఆ లక్ష్యానికి ఎగనామం పెట్టి, ఆస్పత్రులు, శరణార్థి శిబిరాలపైనా యథేచ్ఛగా బాంబుల వర్షం కురిపిస్తూ అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ సైన్యం హతమార్చిన యాభైరెండు వేలమందిలో హమాస్ ఉగ్రవాదులు ఎంతమందో ఆయన చెప్పగలరా? జనవరి నెలలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగలో తొక్కి మళ్లీ యుద్ధానికి సిద్ధపడిన నెతన్యాహు ప్రధాన లక్ష్యం గాజా ఆక్రమణే. గాజాను స్వాధీనం చేసుకుని, కరవు పరిస్థితులను నివారిస్తామని నెతన్యాహు చెబుతుండగా, అక్కడి ప్రజలను వేరే చోటికి తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. మొత్తానికి ఇద్దరికీ ఒకటే లక్ష్యం.. గాజాను హస్తగతం చేసుకోవడం. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టీ పట్టగానే ఆధునిక శాంతిదూత అవతారమెత్తిన ట్రంప్, రష్యా- ఉక్రెయిన్‌బీ హమాస్- ఇజ్రాయెల్ యుద్ధాలపై గుడ్లురిమారు. తక్షణమే యుద్ధవిరమణ జరగకపోతే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కానీ, వాస్తవంలో తాను ఆశించింది జరగకపోగా, ఇజ్రాయెల్‌ను కనీసం చర్చల వేదికపైకి కూడా రప్పించలేకపోతున్నారు. అంతెందుకు, గాజాపై ఇజ్రాయెల్ అమానుష కాండను తాజాగా బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ముక్తకంఠంతో ఖండించగా అమెరికా వాటితో గొంతు కలపకపోవడం దేనికి సంకేతం? ఇజ్రాయెల్‌తో స్వేచ్ఛా వాణిజ్య చర్చలను సైతం నిలిపివేసి, బ్రిటన్ తన నిబద్ధతను చాటుకోవడం ప్రశంసనీయం. హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలే లక్ష్యంగా 2023 అక్టోబర్ 1న యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఇప్పుడు తన లక్ష్యాన్ని తానే తుంగలో తొక్కి గాజా ఆక్రమణ దిశగా అడుగులు వేయడానికి స్వప్రయోజనాలతోపాటు రాజకీయ ప్రయోజనాలు కూడా కారణం. యుద్ధాన్ని ఎంతకాలం కొనసాగిస్తే అంతకాలం తాను పదవిలో కొనసాగవచ్చునన్నది ఆయన ఆలోచనగా కనబడుతోంది. ఇప్పటికే నెతన్యాహుపై అనేక అవినీతి ఆరోపణలపై వివిధ కోర్టులలో విచారణ జరుగుతోంది. మరోవైపు నిరంతర యుద్ధం పట్ల ఇజ్రాయెల్ లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇప్పటికైనా మేలుకోవాలి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాల బాటలో ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చేందుకు చేయిచేయీ కలిపి ముందుకు రావాలి. గాజాకు మానవతా సాయం అందించడమే తక్షణ కర్తవ్యంగా నెతన్యాహు మెడలు వంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి.

# గ్లోబల్‌ట్యాక్స్‌తో గ్రీన్‌గ్యాస్ ఉద్గారాలు తగ్గేనా?



గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్షాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్షాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది. అయినప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్షాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్లూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు 4 మధ్య ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 20202కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

# విపక్షరాష్ట్రాల్లో ఇడి దూకుడు




సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై మరోసారి సుప్రీం కోర్టు ఆగ్రహించడం తాజాగా చర్చనీయాంశమైంది. గత ఏడాది మే నెలలో ఇడి దర్యాప్తు తీరుపై ఎన్నో ఫిర్యాదులు రావడంతో సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని హెచ్చరించింది. అయినాసరే ఇడి వ్యవహారంలో మార్పు రాలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందని గత కొన్ని సంఘటనల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలు జరిపింది. ఇటీవల మళ్లీ మేనెల ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలపై రాష్ట్రపోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇడి సోదాలు చేస్తోందని, టాస్మాక్ అధికారులను హింసిస్తోందని తమిళనాడు ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇడి తీరును తప్పుపట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థల్లో కూడా బుధవారం (మే 21) ఇడి సోదాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఈ విద్యాసంస్థలు గత కొన్నేళ్లుగా పేరుపొందినవే. కర్ణాటక ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతుండడంతో బిజెపి కన్నెర్రచేస్తోందని అందుకే దర్యాప్తు సంస్థలతో భయపెడుతోందని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తోందని కర్ణాటక కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తోంది. కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హోం మంత్రి విద్యాసంస్థలకు, రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. ఈ దాడులు వెనుక కేంద్రంలోని అధికార బిజెపి ప్రేరణ ఉందని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది రూ. 2000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అప్పటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్‌ను ఇరికించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నిస్తోందని, దీనికోసం తమ రాష్ట్రంలో భయానక పరిస్థితి కల్పిస్తోందంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో భాగంగా అవతలివారిని బెదిరించి భయపెట్టడం మంచిది కాదని సుప్రీం కోర్టు ఇడిని మందలించింది. మనీలాండరింగ్ చట్టం లోని కొన్ని నిబంధనలను కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేసి భయపెట్టడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కూడా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. ఆనాడు చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం సాగడం రాజకీయంగా అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికే అన్న అపవాదు కూడా వచ్చింది. కర్ణాటకలో వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కునేలా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును తెరపైకి తీసుకురాడానికి కూడా ఇడి పావులు కదిపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ కల్లేష్ బి ఫిర్యాదు చేయడంతో ఇడి అధికారులు ఇద్దరిపై కర్ణాటకలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అయితే కర్ణాటక హైకోర్టు దీనిపై స్టే విధించడంతో ఈ వ్యవహారానికి బ్రేకు పడింది. నగదు అక్రమ చలామణీ జరిగిందని ఇడి పెడుతున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువే అని సుప్రీం కోర్టు కూడా గతంలో వ్యాఖ్యానించింది. పక్కాగా సాక్షాధారాలు సేకరించడంలో ఇడి వైఫల్యాన్ని సుప్రీం ఎత్తి చూపింది. 2014 2024 మధ్య కాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని కేంద్ర హోంశాఖ గత ఏడాది వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై సోదాలు కూడా దూకుడుగా హద్దులు దాటుతుండడమే అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం ఇడి విశ్వసనీయతకు తీరని కళంకం. టాస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై సుప్రీం స్టే విధించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బిజెపి కుట్రల్లో ఇదో భాగంగా తమిళనాడు ప్రభుత్వం విమర్శిస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల దాడులు విచక్షణా రహితంగా సాగుతున్నాయన్న అపవాదు చాలా కాలంగా వినిపిస్తోంది. కేంద్రం కనుసన్నల్లోనే ఇవి పనిచేస్తున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న విపక్ష పాలిత రాష్ట్రాల పైనే ఈ దాడులు టార్గెట్ చేసుకుంటున్నాయి. ం

ఆయా వర్గాల ఆస్తులు జప్తు అవుతన్నాయి. ఇడి జప్తు చేసిన ఆస్తుల పరిస్థితి పరిశీలిస్తే యుపిఎ ప్రభుత్వ హయాంలో 200405 నుంచి 201314 వరకు కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి. అలాగే ఇడి కేసుల్లో 95% ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే.

# లిక్కర్ కేసులో నెక్స్ట్ జగన్‌ను ఇరికిస్తారు..

## పేర్ని నాని కీలక వ్యాఖ్యలు..!




అమరావతి,: పోలీసు వేధింపులకు దేశంలోనే నిలువుటద్దంలా ఏపీ నిలుస్తుందని.. కస్టోడియల్ టార్చర్ కి ఏపీ పోలీస్ స్టేషన్ లు వేదికలుగా మారిపోతున్నాయని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు.. గతంలో సోనియాతో కలిసి జగన్ ను 16 నెలలు జైలులో ఉంచేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు.. లిక్కర్ కేసులో బెయిలుపై బయట తిరుగుతున్న చంద్రబాబు.. లేని లిక్కర్ కేసు సృష్టించారని విమర్శించారు. లిక్కర్ కేసులో మొదట విజయసాయిరెడ్డిని లైన్ లోకి తెచ్చారు.. ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్లటంతో కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెచ్చారు.. ఆ తర్వాత జగన్ పేరు తెస్తారని మాజీ మంత్రి ఆరోపించారు.. ఇసుమంత కూడా బిడియపడకుండా అబద్ధాల ప్రచారం చేస్తున్నారన్నారు.. మరోకరు డబ్బు మొత్తం ఫారిన్ వెళ్ళిపోయాయి అని చెప్పారు.. ఆ తర్వాత ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అంటారు.. ఇప్పుడేమో మిథున్ రెడ్డి అంటున్నారని వ్యాఖ్యానించారు.. రోజుకో కథ వండి వారుస్తున్నారని లక్షల కోట్ల పేజీల మెమరీ డిలీట్ చేశారని పేపర్లలో రాస్తారని.. జగన్ అరెస్ట్ నుంచి మొదలు పెట్టి కిందకు వస్తారన్నారు.. బట్ట కాల్చి ఎదుటి వారిపై వేసే రాజకీయం చేస్తున్నారని పేర్ని నాని పేర్కొన్నారు. "చంద్రబాబు అరెస్ట్ అయ్యారు.. జగన్ను కూడా అరెస్ట్ చేయాలి.. చంద్రబాబు పోలీసులకు ధైర్యం చెప్పారని ఓసారి చెప్పారు.. పేపర్ లో వార్త రాస్తే పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయిన రెడ్ బుక్ రాజ్యాంగకర్త.. పీఎస్ఆర్ ఆంజనేయులు పక్కగా విధి నిర్వహణ చేశాను అని నమ్మారు కాబట్టే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు.. జైలులో కూడా ఆయన చంద్రబాబుకు నిత్య పూజలు చేసుకునే వ్యక్తి అని జైలు అధికారులే చెప్పుకుంటున్నారు.. అరెస్ట్ అప్పుడే తప్పు ఒప్పుకున్నారు కదా.. మళ్ళీ ఇప్పుడు ఎందుకు సోదాలు.. రాజ్యమే ప్రజలను హింసిస్తే ప్రజల ఆగ్రహంలో కొట్టుకుపోతారు.. ఏపీలో తల్లికివందనం జరుగుతుందని ఢిల్లీ మీడియాకు చెబుతున్నారు చంద్రబాబు.. ఏపీలో ఒక్క ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కూడా ప్రారంభించలేదు." అని విమర్శించారు. సొంత పార్టీ నేతలే ప్రజల దగ్గరకు వెళ్లలేక మదన పడుతున్నారని.. ఈ ప్రభుత్వం ఆ ముగ్గురి సంపద సృష్టి కోసం మాత్రమే అని వైసీపీ నేత పేర్ని నాని తెలిపారు.. "చంద్రబాబు ఇంటికి కాయగూరలు కావాలంటే వెళ్లి తెచ్చుకుంటున్నారు కదా.. జగన్ లాగా నేను అప్పులు చేసి పథకాలు ఇవ్వను.. నేను సంపద సృష్టించి ఇస్తానని చెప్పారు.. సంవత్సరం తిరిగే లోపు లక్షన్నర కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం.. కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇంట్ కరెంట్ కోసం యూనిట్ 9 రూపాయలు వసూలు చేస్తున్నారు.." అని ఆరోపించారు.

# మంత్రి కొండా సురేఖతో మంత్రి సీతక్క భేటీ.. ఎందుకంటే?




హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ భేటీలో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో అటవీ పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా అటవీ శాఖ నిబంధనల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చ జరిగింది. ఈ సమన్వయ సమావేశానికి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అటవీశాఖ ఉన్నతాధికారులు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, ఐటిడిఎ అధికారులు హాజరయ్యారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు మా దృష్టికి తీసుకువస్తున్నారని, ప్రజల తరఫున ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అటవీ గ్రామాల్లో కనీస వసతులైన రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, తాగునీరు, కరెంటు లైన్లు ఏర్పాటు చేయడానికి అటవీశాఖ సహకరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అడవుల్లోని చట్టాలను చూపించి అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడకూడదు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి, గ్రామాల్లో కాకుండా అని సూచించారు మంత్రి సీతక్క. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితుల మేరకు అనుమతులు ఇవ్వకుండా, ఫైళ్లను తేడాలు చూపుతూ పెండింగ్‌లో వేయడం అభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అడవిలో నివసించే ఆదివాసీలకు తునికాకు, అడవి పండ్ల సేకరణపై అటవీ చట్టం హక్కు ఇస్తున్నప్పటికీ, అధికారులు అడుగడుగునా వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారని విమర్శించారు. అటవీ పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా సజావుగా సాగాలన్నారు మంత్రి సీతక్క. ఈ రెండింటికీ సమన్వయం అవసరం. అవసరమైతే చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ద్వారా అనుమతులు తెప్పించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా అటవీ గ్రామాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయని, అన్ని శాఖల మధ్య సమన్వయంతో సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొననున్నట్లు వెల్లడించారు.

# ఢిల్లీకి ఉరుములతో కూడిన భారీ వర్ష సూచన



న్యూఢిల్లీ,: దేశ రాజధాని ఢిల్లీకి కేంద్ర వాతావరణ శాఖ ఉరుములతో కూడిన భారీ వర్ష సూచన చేసింది. ముందస్తు రుతుపవనాల రాక కారణంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ మేరకు ఐఎండీ వార్నింగ్ ఇచ్చింది. ఆది, సోమవారాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఆకాశం మేఘావృతం అయి ఉంటుందని.. ఉరుములు, తుఫానులు వచ్చే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఢిల్లీ పరిసర ప్రాంతాలలో గంటకు 76 కి.మీ వేగంతో గాలులు వీచడంతో పాటు బలమైన దుమ్ము తుఫాను వీచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఢిల్లీ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వచ్చేశాయి. శనివారం మధ్యాహ్నం నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 16 ఏళ్ల తర్వాత తొలిసారిగా రుతుపవనాలు కేరళను తాకాయని ఐఎండీ తెలిపింది. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు త్వరగా రుతుపవనాలు వచ్చాయి. సాధారణ తేదీ కంటే 8 రోజులు ముందే రుతుపవనాలు వచ్చినట్లు ఐఎండీ పేర్కొంది. వాస్తవంగా రోహిణి కార్తె సమయంలో ఎండలు మండిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తలేదు. ఇక రోహిణి కార్తె మే 25న(ఆదివారం) రానుంది. ఇది జూన్ 8 వరకు ఉంటుంది. రాహిణి కార్తె సమయంలో ఎండలు భగభగ మండిపోతాయి. తీవ్ర ఉష్ణోగ్రతతో బండరాళ్లు కూడా పగిలిపోతాయంటారు. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించకపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా 1918 మే 11న రుతుపవనాలు ప్రవేశించిన రికార్డ్ ఉంది. అలాగే రుతుపవనాలు ఆలస్యంగా వచ్చిన రికార్డు ఉంది. 1972లో జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. గత 25 సంవత్సరాల్లో అత్యంత ఆలస్యంగా రుతుపవనాలు 2016లో వచ్చాయి. జూన్ 9న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉంటే రుతుపవనాల రాకతో మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. తమిళనాడు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు మరియు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

# శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'



అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు. అడుగడుగునా అవమా నిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్లరెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి. కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు. అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అల వాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం. ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయి త్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరేహింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీ కరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండాఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు. నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతంకన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచు తున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు. దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం! నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచ కోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

# ఉత్తరాది నీటి యుద్ధాలు ఆపండి



పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య దశాబ్దాల నాటి నీటి వాటాల వివాదం మళ్లీ భగ్గుమంటోంది. తమ వాటానుంచి ఒక్క నీటి చుక్కయినా పొరుగు రాష్ట్రం హర్యానాకు ఇచ్చేది లేదని పంజాబ్‌లోని ఆప్ నేతృత్వంలోని భగవంత్ మాన్‌సింగ్ ప్రభుత్వం భీష్మించుకుంది. ఈ మేరకు ఇటీవల అసెంబ్లీలో కూడా తీర్మానం చేసింది. నీటి వాటా హక్కులను కాజేయడానికి బిజెపి కేంద్రం వత్తాసుతో భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు (బిబిఎంబి) ద్వారా తన హర్యానా ప్రభుత్వంతో ప్రయత్నిస్తోందని పంజాబ్ నీటి వనరుల మంత్రి బరీందర్ కుమార్ గోయల్ ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా పంజాబ్‌లోని అరవై శాతం పొలాలు భాక్రా కెనాల్ నుంచి సాగు నీటిని పొందుతున్నాయని, అందువల్ల అదనంగా ఏ రాష్ట్రానికీ నీటిని కేటాయించడానికి అవకాశం లేదని తీర్మానం పేర్కొంది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ దీనిపై అఖిల పక్షసమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు దీనికి సంఘీభావం ప్రకటించాయి. అయితే బిజెపి నేతలు గతంలో హర్యానా అదనపు నీటిని పొందగలిగిందని, దీనివల్ల ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించవచ్చని వాదిస్తున్నారు. దీనికి సమాంతరంగా హర్యానా ప్రభుత్వం కూడా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పంజాబ్ నుంచి అదనంగా నీటిని పొందడానికి ఏకగ్రీవంగా తీర్మానించింది. అదనంగా నీటిని విడుదల చేయడానికి పంజాబ్ అంగీకరించిందని హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ చెబుతున్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ జోక్యం చేసుకోవాలని అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ అభ్యర్థించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు. హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు అదనపు నీటిని విడుదల చేస్తామని పంజాబ్ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించినప్పటికీ నిప్పుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. అయితే పంజాబ్ నీటిని విడుదల చేయబోమని పట్టుబట్టి కూర్చుంటే హర్యానాకు చెందిన ఎనిమిది జిల్లాలు తీవ్ర జలసంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు. శిర్సా, హిసార్, ఫతేబాద్, జింద్, కిథల్, కురుక్షేత్ర, చరి?దాద్రి, భివానీ జిల్లాలకు ప్రస్తుతం దాహార్తిని తీర్చడానికి తక్షణం 4931.90 కోట్ల లీటర్ల నీరు అవసరం కాగా, కేవలం 764.80 కోట్ల లీటర్ల నీరే అందుతోంది. భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు ( బిబిఎంబి) రిజర్వాయర్ల నుంచి ఎనిమిది రోజులపాటు రోజుకు 4500 క్యూసెక్కుల నీటిని హర్యానాకు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశించడంతో తాజాగా రెండు రాష్ట్రాల నీటి పంపకంపై ప్రతిష్టంభన ఏర్పడింది. శనివారం నాడు బిబిఎంబి సమావేశాన్ని పంజాబ్ బహిష్కరించింది. బిబిఎంబి జారీ చేసిన నోటీసుకు అసమ్మతి తెలియజేసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు ఈ విషయమై ఆలోచించేది లేదని కరాఖండీగా చెప్పింది. వార్షిక బిబిఎంబి నీటి కేటాయింపు సైకిల్ మే 21 నుంచి ప్రారంభం కానున్న తరుణంలో ఈ వివాదం నెలకొనడం గమనార్హం. పంజాబ్ అభ్యంతరాన్ని తోసిరాజంటూ హర్యానాకు కేంద్ర హోం కార్యదర్శి గోవింద మోహన్ వత్తాసు పలకడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఏప్రిల్ 30న ఉభయ రాష్ట్రాల అధికారులు బిబిఎంబి సమావేశానికి హాజరయ్యారు. 8500 క్యూసెక్కుల నీటిని హర్యానాకు విడుదల చేయాలని బిబిఎంబి ఆదేశించింది. 1910 నాటికే సంకల్పించిన భాక్రానంగల్ నదీ ప్రాజెక్టు స్వాతంత్ర్యం వచ్చాక తొలినాళ్లలో రూపుదిద్దుకుంది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టును నిర్మింప చేశారు. సట్లజ్ నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టులో రెండు భాగాలున్నాయి. భాక్రా డ్యామ్ హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్మాణం కాగా, పది కిలోమీటర్ల దిగువ ప్రవాహంలో పంజాబ్‌లో నంగల్ డ్యామ్ నిర్మించారు. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌గా రాష్ట్రం విడిపోక ముందు భాక్రా నంగల్ ప్రాజెక్టు పంజాబ్ ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలోనే ఉండేది. అయితే మూడు రాష్ట్రాల ప్రయోజనాలను నెరవేర్చడానికి వీలుగా 1966 లో భాక్రా మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటైంది. మళ్లీ 1976లో భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డుగా పేరు మార్చుకుంది. అదనంగా మరికొన్ని ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలు ఈ బోర్డుకు అప్పగించబడ్డాయి. బియాస్ నదిపై బియాస్ సట్లజ్ లింక్ ప్రాజెక్టు (పాండో డ్యామ్), పాంగ్ డ్యామ్, ఈ రెండూ హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలు బోర్డుకు దఖలు పడ్డాయి. ఇప్పుడు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలకు నీటి కేటాయింపులో భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డుదే కీలకమైన పాత్ర. అయినా పంజాబ్, హర్యానా నీటి వాటా విషయంలో బిజెపి ప్రభుత్వ పెత్తనం వివాదాలకు దారి తీస్తోంది. పంజాబ్‌ను నచ్చచెప్పడానికి బదులు ఆదేశించడం వివాదం మరింత ముదురుతోంది. కేంద్రంలోని బిజెపి, హర్యానాలోని బిజెపి ప్రభుత్వానికి అండగా నిలుస్తోంది. భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డును అడ్డం పెట్టుకుని పంజాబ్‌పై ఒత్తిడి తెస్తోంది. హర్యానా ఇప్పటికే తనకు కేటాయించిన 104% నీటిని వాడుకుందని, పంజాబ్ పేర్కొంది. అయితే అత్యంత అవసరమైన తాగునీటిని తమకు అందించకుండా పంజాబ్ అడ్డుకుంటోందని హర్యానా వాదిస్తోంది. పహల్గాం ఉగ్రదాడి మారణకాండకు పాక్ ప్రమేయం ఉందని ప్రతీకారంగా పాకిస్తాన్‌తో సింధునదీ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకోవడమే కాక, అన్ని విధాలా పాక్‌ను టార్గెట్ చేసుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో అంతర్గతంగా నీటి వాటాల పంపకంలో వివాదాలు మరింత తీవ్రం కావడం మంచిది కాదు. అలాగే ఇందులో రాజకీయాలు ప్రేరేపించి రాష్ట్రాల మధ్య అగ్గిరాజేయడం క్షేమం కాదు. దేశంలో భాగస్వాములంతా చేతులు కలిపి తమ విభేదాలను పరిష్కరించుకోవలసిన బాధ్యత ఉంది.

# దేశద్రోహుల భరతం పట్టాలి



జ్యోతి మల్హోత్రా పేరు ఇప్పుడు భారతదేశం అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఆకర్షణీయ రూపురేఖలతో, చక్కటి ఉచ్చారణతో, మంచి వాగ్ధాటితో ఎంతటివారినైనా ఇట్టే ఆకర్షించే శక్తిసామర్థ్యాలు గల జ్యోతి మల్హోత్రా, పర్యాటక ప్రాంతాలకు దూసుకెవెళ్లి, వార్తా విశేషాలను కవర్ చేస్తూ వాటిని వీడియోల ద్వారా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ వీక్షకుల మన్ననలు పొందిన ట్రావెల్ యూట్యూబర్‌గా పేరు పొందింది. ఆమె ఇప్పుడు అనేక ఆరోపణలతో చిక్కుల్లోపడింది. ఆమె పాకిస్తానీ నెంబరు 1 గూఢచారిణి అని కొందరు అంటున్నారు. ఈ విషయం తెలిసిందే తడవుగా అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ సైనిక ఇంటలిజెన్స్ వర్గాల పరిశోధనా సంస్థలు అనేక విషయాలతోపాటు యూట్యూబర్ల కార్యకలాపాలపై కూడా విచారణ చేశాయి. ఈ సందర్భంగా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా దేశద్రోహ కుట్రల ఆనువాళ్ళ చరిత్ర బయటపడినట్లు తెలుస్తోంది. మనదేశంలో బతుకుతూ తన ట్రావెలర్ యూట్యూబర్ వృత్తిలో భాగంగా అనేక ఆకర్షణీయమైన, కీలకమైన ప్రదేశాలను పర్యటిస్తూ, ముఖ్యమైన కట్టడాల వీడియోలు తీసి పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో ముఖ్య అధికారులతో సంబంధాలు పెట్టుకొని, వారితో సంప్రదింపులు జరిపి మన దేశానికి చెందిన కీలక సమాచారం అందించిందని అందులోనూ సైనిక స్థావరాల సమాచారం కూడా ఉందట. ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో లంచం అందుకుంటూ వస్తుందట. ఇప్పుడు ఈ యూట్యూబర్‌ను భద్రతా బలగాలు తగిన ఆధారాలతో అరెస్టు చేసింది. ఆమెపై ఇంటరాగేషన్ ఇంకా జరుగుతున్నది.ఇంకా సంపూర్ణ సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. ఆమెకు ట్రావెల్ విత్ జో అనే పేరుగల యూట్యూబ్ ఛానల్ ఉంది. ఆమె మొదట్లో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సంచరించింది. తాను హర్యానా, పంజాబీని అని పరిచయం చేసుకుంది. 33 ఏండ్ల ఈ యూట్యూబర్‌కు ఇప్పటికే 3 లక్షల 85 వేలకు పైగా ఖాతాదార్లు ఉన్నారు. ఆమె పర్యాటక వీడియోలకు ప్రజాదరణ దక్కింది. ఫలితంగా ఆమెలో తక్కువ సమయంలో అధిక ధనం, ఆస్తులు సంపాదించుకోవాలి అనే కోరిక పెరిగింది. దీనితో ఆమె తన వృత్తి ధర్మాన్ని వదిలిపెట్టి దేశంలో కీలక ప్రదేశాలు, కట్టడాలను వీడియోలు తీసి మన శత్రుదేశం పాకిస్తాన్ ఏజెంట్లుకు చేర వేసిందట. ఈ క్రమంలో పలు దేశాలను స్పెషల్ క్లాస్ విమానాల్లో పర్యటించింది. అమెరికా, చైనా, పాకిస్థాన్ వంటి పలు దేశాల్లోని విలాసవంతమైన హోటళ్లలో ఉంటూ అక్కడ ఉన్న సీక్రెట్ స్థలాలు పర్యటించింది. ఆమె అందం, చురుకుదనం అన్నింటిని చూసి పాక్ సమాచార అధికారులు ఆమెను తమ ఏజెంటుగా వాడుకున్నారని పోలీసులు తెలిపారు. ఆమె తెగువతనం చివరికి ఆమెను ఏజెంటుగా చేసిందని కేసు దర్యాప్తులో ఉన్న ఎస్‌పి శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. ఆమెకు ఉన్నత స్థాయిలో కనెక్షన్లు లేవని, రహస్య సమాచారం తెలిపే సరైన వనరులుకాని, వ్యక్తుల పరిచయాలు కాని లేవని పాక్ రహస్య గూఢచార సంస్థల అధికారులకు కూడా తెలుసు. అయితే ఆమెకున్న చొరవతో ఈ దిశలో ఆమెను తమ కీలక పాత్రధారిగా చేసుకోవచ్చునని నిర్ధారించుకుని ఆమెను రంగంలోకి దింపినట్లు తెలిసింది. పాకిస్తానీ అధికారులను ఏ విధంగా కలిశారనేది కీలక విషయం అయింది. ఆ దిశగా పరిశోధన సాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తరువాత న్యూఢిల్లీలోని పాక్ హైకమిషనర్ కార్యాలయంలో ఆమె పాక్ అధికారి డానిష్ను కలిసింది. అంతకు ముందు ఆమె పలు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లిరావడం, చివరికి పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా ఆమె అక్కడ ఓ అతిథి గృహంలో మకాం వేసి ఉండటం వంటి విషయాలను ఇప్పుడు మన ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఆమెకు చెందిన పలు ఫోన్లు, యూట్యూబ్లు, ల్యాప్ ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌లలో మారు పేర్లతో పాకిస్తాన్ రాయబార కార్యాలయం సిబ్బంది పేర్లు ఉన్నాయట. గత ఏడాది మార్చిలో ఆమె పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చింది. పైగా పర్యాటకం మునుగులో ఓ వీడియో వెలువరించింది. అప్పట్లో ఆమె పాకిస్తాన్ పర్యటనలో భాగంగా తీసిన వీడియోలో ఆమె పాకిస్తాన్‌ను అదే పనిగా కొనియాడిందని భద్రతా అధికారులు గుర్తించారు. పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు. ఆమె 2023లో పది రోజుల పాటు పార్టీలు, విందులు, వినోదాలతో విలాసవంతంగా గడిపిందిట. అక్కడ ఆమె బస పర్యటనల బాధ్యతను అక్కడి కీలక వ్యక్తి అలీ ఆహవాన్ చూశారని వెల్లడైంది. దేశంలోని పలు ప్రాంతాలు ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్‌లో కూడా ఆమె యూట్యూబర్‌గా పర్యటించినట్లు కొందరు ప్రముఖులతో పరిచ యాలు పెంచుకున్నట్లు వెల్లడైంది. దేశంలో ఇప్పటికీ దాదాపు డజన్ కు పైగా రహస్య ఏజెంట్లు వివిధ ప్రాంతాలలో పట్టుబడ్డారు. పాకిస్తాన్ కు కీలక సైనిక రహస్య సమాచారం చేరవేతల అభియోగాలతో ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో పట్టుబడ్డ వారిలో ట్రావెటర్ యూట్యూబర్ జ్యోతి, ఇతరులు అనేకులు ఇప్పటివరకూ అరెస్టు అయ్యారు. వారిపై ఇంటరాగేషన్ జరుగుతుంది. పాకిస్థాన్ ఇరుగు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వారే ఈ పట్టుబడ్డవారిలో ఉన్నారని అధికారిక ప్రకటనలతో వెల్లడైంది. పహల్గాం ఉగ్రదాడి, తరువాత ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో ఈ పాకిస్తాన్ ఏజెంట్లను అరెస్టు చేశారు. పంజాబ్ నుంచి ఆరుగురు, హర్యానా నుంచి ఐదుగురు,యుపి నుంచి ఒక్కరు ఇప్పటి వరకు పట్టుబడ్డారు. అన్వేషణ కొనసాగుతున్నది. అనేక రహస్య సమాచారం వెల్లడి కావల్సి ఉంది.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక www.saisuryaa.com

సంపాదకీయం

# విపక్షరాష్ట్రాల్లో ఇడి దూకుడు

## (విశ్లేషణ)

సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై మరోసారి సుప్రీం కోర్టు ఆగ్రహించడం తాజాగా చర్చనీయాంశమైంది. గత ఏడాది మే నెలలో ఇడి దర్యాప్తు తీరుపై ఎన్నో ఫిర్యాదులు రావడంతో సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని హెచ్చరించింది. అయినాసరే ఇడి వ్యవహారంలో మార్పు రాలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందని గత కొన్ని సంఘటనల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలు జరిపింది. ఇటీవల మళ్లీ మేనెల ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలపై రాష్ట్రపోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇడి సోదాలు చేస్తోందని, టాస్మాక్ అధికారులను హింసిస్తోందని తమిళనాడు ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇడి తీరును తప్పపట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థల్లో కూడా బుధవారం (మే 21) ఇడి సోదాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఈ విద్యాసంస్థలు గత కొన్నేళ్లుగా పేరుపొందినవే. కర్ణాటక ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతుండడంతో బిజెపి కన్నెర్రనౌతోందని అందుకే దర్యాప్తు సంస్థలతో భయపెడుతోందని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తోందని కర్ణాటక కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తోంది. కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హోం మంత్రి విద్యాసంస్థలకు, రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. ఈ దాడులు వెనుక కేంద్రంలోని అధికార బిజెపి ప్రేరణ ఉందని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది రూ. 2000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అప్పటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్‌ను ఇరికించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నిస్తోందని, దీనికోసం తమ రాష్ట్రంలో భయానక పరిస్థితి కల్పిస్తోందంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో భాగంగా అవతలివారిని బెదిరించి భయపెట్టడం మంచిది కాదని సుప్రీం కోర్టు ఇడిని మందలించింది. మనీలాండరింగ్ చట్టం లోని కొన్ని నిబంధనలను కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేసి భయపెట్టడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కూడా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. ఆనాడు చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం సాగడం రాజకీయంగా అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికే అన్న అపవాదు కూడా వచ్చింది. కర్ణాటకలో వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కునేలా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును తెరపైకి తీసుకురావడానికి కూడా ఇడి పావులు కదిపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ కల్లేష్ బి ఫిర్యాదు చేయడంతో ఇడి అధికారులు ఇద్దరిపై కర్ణాటకలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అయితే కర్ణాటక హైకోర్టు దీనిపై స్టే విధించడంతో ఈ వ్యవహారానికి బ్రేకు పడింది. నగదు అక్రమ చలామణీ జరిగిందని ఇడి పెడుతున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువే అని సుప్రీం కోర్టు కూడా గతంలో వ్యాఖ్యానించింది. పక్కాగా సాక్షాధారాలు సేకరించడంలో ఇడి వైఫల్యాన్ని సుప్రీం ఎత్తి చూపింది. 2014 2024 మధ్య కాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని కేంద్ర హోంశాఖ గత ఏడాది వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై సోదాలు కూడా దూకుడుగా హద్దులు దాటుతుండడమే అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం ఇడి విశ్వసనీయతకు తీరని కళంకం. టాస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై సుప్రీం స్టే విధించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బిజెపి కుట్రల్లో ఇదో భాగంగా తమిళనాడు ప్రభుత్వం విమర్శిస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల దాడులు విచక్షణా రహితంగా సాగుతున్నాయన్న అపవాదు చాలా కాలంగా వినిపిస్తోంది. యన్న అను కేంద్రం కనుసన్నల్లోనే ఇవి పనిచేస్తున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న విపక్ష పాలిత రాష్ట్రాల పైనే ఈ దాడులు టార్గెట్ చేసుకుంటున్నాయి. ఆయా వర్గాల ఆస్తులు జప్తు అవుతన్నాయి. ఇడి జప్తు చేసిన ఆస్తుల పరిస్థితి పరిశీలిస్తే యుపిఎ ప్రభుత్వ హయాంలో 200405 నుంచి 201314 వరకు కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి. అలాగే ఇడి కేసుల్లో 95% ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే.

# ఐక్యరాజ్య సమితి సాక్షిగా.. ప్రపంచం ముందు పాకిస్తాన్ ఉగ్రవాద బండారాన్ని బయటపెట్టిన భారత్.. !

ఉగ్రవాదులకు, పౌరులకు మధ్య తేడా చూపని పాకిస్తాన్‌కు ప్రాణరక్షణ గురించి మాట్లాడే అర్హత లేదని భారత్ తేల్చి చెప్పింది. సాయుధ సంఘర్షణలో పౌరుల రక్షణ అంశంపై ఐక్యరాజ్యసమితిలో చర్చ సందర్భంగా భారత్ తన గొంతు బలంగా వినిపించింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులను పాక్ రాయబారి ప్రస్తావించటంతో భారత్ ధీటుగా బదులిచ్చింది. భారత్ దశాబ్దాలుగా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులతో పోరాడుతోందని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అన్నారు. ముంబై దాడుల నుంచి మొదలుకుని ఇటీవల పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై ఉగ్రదాడుల దాకా పాకిస్తాన్ కిరాతకాలను యూఎన్‌వోలో ప్రస్తావించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం కలిసి పోరాడాలని, ఉగ్రవాదులకు రక్షణ కల్పించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్ కోరారు. పౌరులు, మానవతావాదులు, జర్నలిస్టులు, మీడియా నిపుణులకు ఎదురవుతున్న ముప్పులను పరిష్కరించాల్సిన తక్షణ అవసరాన్ని హరీష్ గుర్తు చేశారు. అదే సమయంలో మెరుగైన జవాబుదారీతనం యంత్రాంగాలకు పిలుపునిచ్చారు. పాకిస్తాన్ ప్రతినిధి అనేక అంశాలపై చేసిన నిరాధారమైన ఆరోపణలను హరీశ్ సమర్థవంతంగా తిప్పికొట్టారు. భారతదేశం దశాబ్దాలుగా తన సరిహద్దుల్లో పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాద దాడులను ఎదుర్కొంటోందని హరీష్ అన్నారు. ఇది ముంబై నగరంపై జరిగిన 26/11 భయంకరమైన దాడి నుండి 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో అమాయక పర్యాటకులను దారుణంగా హత్య చేసిన వరకు ఐక్యరాజ్యసమితి ముందు ఉంచారు. 'పాకిస్తాన్ ఉగ్రవాద బాధితులు ప్రధానంగా పౌరులు, ఎందుకంటే దాని లక్ష్యం మన శ్రేయస్సు, పురోగతి, నైతికతను దాడి చేయడం.

అలాంటి దేశం తన పౌరుల భద్రతపై చర్చలో పాల్గొనడం కూడా అంతర్జాతీయ సమాజానికి అవమానం' అని హరీశ్ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇది సైనిక ఘర్షణగా మారింది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించారు. వారిలో ఎక్కువ మంది పర్యాటకులు. దీంతో ప్రతీకార చర్యగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని, మే 7 తెల్లవారుజామున భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. ఇందులో 9 చోట్ల ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లు ధ్వంసమయ్యాయి. దీని తరువాత, పాకిస్తాన్ భారత సైనిక స్థావరాలపై దాడి చేయడం ప్రారంభించింది. ఇది సైనిక సంఘర్షణను మరింత పెంచింది. పాకిస్తాన్ దాడిని భగ్నం చేస్తూ, భారతదేశం ప్రతీకారం తీర్చుకుని దాని 11 వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. మే 10న, ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కాల్పుల విరమణకు అంగీకరించాయి.



# కశ్మీర్ విద్యార్థులు నేరస్థులా?

ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన మారణకాండను యావద్దేశం గర్హించింది. పర్యాటకులు ఏ మతం వారో పట్టిపట్టి ఆరా తీసి ఉగ్రవాదులు కాల్పులు జరపడం దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అదే రీతిలో కశ్మీర్‌లోయ కాకుండా బయట ఉత్తరాది ప్రాంతాల్లో కశ్మీరీలపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ అయితే చాలు వారి దాడులకు బలైనట్టే. ఈ దాడులకు పాల్పడుతున్న వారికి ఉగ్రవాదులకు తేడా ఏం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఎలాంటి సంబంధం లేకపోయినా, విద్యార్థులను, వ్యాపారులను నేరస్థులుగా ఇతర ప్రాంతాల్లో అనుమానించడం, దాడులు చేయడం తరచుగా జరుగుతున్నాయి. పహల్గాం సంఘటన జరిగిన ఆరురోజుల్లోనే ఈవిధంగా దేశం మొత్తం 17 సంఘటనలు జరిగాయి. ఎక్కువగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఒక వర్గానికి చెందిన మితవాద వర్గాల దురుసుతనమే ఈ సంఘటనల వెనుక కనిపిస్తోంది. పంజాబ్‌లో కశ్మీర్ విద్యార్థులను క్యాంపస్‌లోనే కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఉత్తరాఖండ్‌లో కాలేజీలనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. ఢిల్లీలో జామియా, మిలియా ఇస్లామియా విద్యార్థిపై దౌర్జన్యం చేశారు. హిమాచల్‌ప్రదేశ్, ముస్సోరీలో కశ్మీరీ శాలువాలు విక్రయించే వ్యాపారులపై దాడులు జరిగాయి. కశ్మీర్‌లో ఏదైనా హింస జరిగితే కశ్మీరీలంతా అనుమానితులవుతుండడం పరిపాటిగా సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి బాధాకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న కశ్మీర్ విద్యార్థులకు భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలో వీరికి భద్రత కల్పించే పటిష్టమైన, వ్యవస్థాపరమైన యంత్రాంగం లేదు. అలాగని వారి భద్రతను ప్రజల భావోద్వేగాలతో మారుతున్న అభిప్రాయాలకు విడిచిపెట్టకూడదు.పహల్గాం వంటి దాడులకు పాల్పడే ముష్కరుల లక్ష్యం కేవలం చంపడమే కాదు, సమాజాన్ని చీల్చడం, ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టడం, సామాజిక సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడం, సామాజిక వర్గాల్లో అనుమానాలను ప్రేరేపించడం. ఈ నేపథ్యంలో మనం స్పష్టంగా తెలుసుకోవలసింది కశ్మీరీ విద్యార్థులను హింసించడం దేశభక్తిలో భాగం కాదు. దేశాన్ని అంతర్గతంగా చీల్చాలనుకుంటున్న వారికి విద్యార్థులను దాసోహం చేయడమే అవుతుంది. ఈ హింసాకాండలు కొత్తేమీ కావు. కశ్మీర్ లోయలో ఏదైనా హింసాత్మక సంఘటన జరిగినా లేదా సైనికులు ముష్కరులకు బలైపోయినా, కశ్మీరీ విద్యార్థులకే తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చాలా మంది విద్యార్థులు పేదరికంతోను, సంఘర్షణలతోను సతమతమవుతున్నా ఉన్నత చదువుల ద్వారా చక్కని భవిష్యత్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి అన్ని విధాలా సహకారం అందడానికి బదులు కేవలం కశ్మీరీ అయినందున నేరస్థులుగా అనుమానించడం శోచనీయం. యూనివర్శిటీలు, ఇతర విద్యాసంస్థలు వీరిని పీడించే బందిఖానాలుగా మారుతుంటే పాలనా యంత్రాంగాలు పట్టించుకోవడం లేదు. కాలేజీ నిర్వాహకులు, చట్టాలు, పౌరసమాజం వారిని దేశసంక్షోభ సమయాల్లో బలిపశువులు కాకుండా చూడాలి. వారి ఫిర్యాదులను పరిష్కరించే అధికారులను నియమించాలి. వివక్షకు తావు లేని విధానాలు అమలు చేయాలి. స్థానిక పోలీస్‌ల సహకారంతో వారికి మూకుమ్మడి దాడులనుంచి రక్షణ కల్పించాలి. విధానాలకు అతీతంగా వారి మానసిక క్షోభను నివారించే ప్రయత్నం చేయాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఈ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు, మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు. దేశం పట్ల వారు తమ విధేయతను నిరూపించుకునేలా అవకాశం కల్పించాలి. దేశంలోని మరే ఇతర విద్యార్థి వర్గాలకు ఇలాంటి దుస్సంఘటనలు ఎదురు కాకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల్లో భయం పెరిగి, తమ గుర్తింపు ఎవరికీ తెలియకుండా కాలేజీ క్యాంపస్‌ల్లో దాక్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక సుదీర్ఘకాల ఆందోళనలో మగ్గిపోవలసి వస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జ్ఞాపకాలను నిజంగా మనం మన్నించాలనుకుంటే మతపరమైన ప్రతీకార ఉచ్చులో మనం ఇరుక్కోకూడదు. సంస్థాగత సంకల్పానికి మనం స్పందించాలి. అంతర్గతంగా సాగుతున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి. క్లిష్టపరిస్థితుల్లో కశ్మీరీ విద్యార్థులకు ఎక్కడా, ఏ విద్యాసంస్థల్లోనూ వేధింపులు, బెదిరింపులు, దాడులు ఎదురు కాకుండా ఒక జాతీయ స్థాయి విద్యావిధానాన్ని అమలు చేయడం తప్పనిసరి. సామాజిక, సామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక హింసాత్మక సంఘటన చాలన్న ముష్కరుల జోస్యానికి అవకాశం ఇవ్వరాదు. హింసకు మన సమాధానం ఐక్యత తప్ప పగ, ప్రతీకారం కారాదు. మనబలం కరుణే తప్ప ప్రతిదాడి కారాదు. కశ్మీరీ విద్యార్థులు కోరుకునేది మన నుంచి అనుమానం కాదు, మనం అందించే సంఘీభావం. ఇప్పుడు మనకు కావలసింది కశ్మీరీ విద్యార్థులకు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించడం. అమాయకులైన యువత నేరారోపణకు బలికాకుండా వారిని రక్షించుకోవడానికి మనం కృతనిశ్చయులమై ఉండాలి. పహల్గాం దాడి సమయంలో వివిధ ప్రాంతాల పర్యాటకులను కులమతాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకున్నది కశ్మీర్ ముస్లింలే అన్న వాస్తవాలను మరిచిపోరాదు. బాధితులకు ఆపన్నహస్తం అందించిన కశ్మీర్ లోయపైన, అక్కడి ప్రజలపైన, విద్యార్థులపైన ఎక్కడైనా వివక్ష చూపించడమంటే మనకు మనం శత్రువులం కావడమే.



## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీమిండియాలా కలిసి పనిచేయాలి..

# నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారతదేశం అభివృద్ధి చెందడం ప్రతి భారతీయుడి కల అని అన్నారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇది 140 కోట్ల మంది దేశప్రజల ఆకాంక్ష. మనం అభివృద్ధి వేగాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమిండియా లాగా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్యం అసాధ్యం కాదన్నారు ప్రధాని మోదీ. ఢిల్లీలో నీతి ఆయోగ్ ముఖ్యమైన సమావేశం జరిగింది. దేశంలోని చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇందులో పాల్గొన్నారు. దేశా అభివృద్ధి వేగాన్ని మనం పెంచాలని ప్రధాని మోదీ అన్నారు. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి కట్టుగా పనిచేసి, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి రాష్ట్రం ప్రపంచ ప్రమాణాల ప్రకారం కనీసం ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, అక్కడ అన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని ప్రధాని మోదీ అన్నారు. ఒక రాష్ట్రం: ఒక ప్రపంచ గమ్యస్థానం విధానం పర్యాటకాన్ని పెంచడమే కాకుండా సమీప నగరాల అభివృద్ధికి కూడా దారితీస్తుందన్నారు. భారతదేశం పట్టణీకరణ వైపు వేగంగా కదులుతోంది. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నగరాల కోసం మనం కృషి చేయాలి. వృద్ధి, ఆవిష్కరణ, స్థిరత్వం మన నగరాల చోదక శక్తిగా మారాలని ప్రధాని మోదీ అన్నారు. అందరి కళ్ళు నీతి ఆయోగ్ సమావేశంపైనే ఉన్నాయి. ప్రధాని మోదీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బీహార్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హారజు కాలేదు. సాయంత్రం 5 గంటలకు ప్రధాని మోదీ సమావేశం ముగింపు ప్రసంగం చేస్తారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధానమంత్రి నిర్వహిస్తున్న మొదటి ప్రధాన సమావేశం ఇది. సాధారణంగా, పూర్తి కౌన్సిల్ సమావేశం ప్రతి సంవత్సరం జరుగుతుంది. గత సంవత్సరం ఇది జూలై 27న జరిగింది. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో స్వర్ణాంధ్రపై ప్రజెంటేషన్ ఇచ్చారు ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్రంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. ఏపీ ప్రతిపాదనలను ఇతర రాష్ట్రాలు పరిశీలించాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ సూచించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని.. గూగుల్, %ూ×% టెక్నాలజీని వాడుతున్నామని తెలిపారు. 2029 నాటికి పేదరిక నిర్మూలనే తమ లక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌పై పలువురు ప్రశంసలు కురిపించారు.

సత్యమేవ జయతే
NITI Aayog

# భారత టెస్టు క్రికెట్‌లో నూతన శకం ప్రారంభం..

# ఇంగ్లండ్ టూర్‌కు జట్టు ప్రకటన



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం మొదలైంది. జూన్ 20 నుం చి ఇంగ్లండ్ టూర్ తో టూర్ ప్రా రం భం కానుంది. టెస్ట్ సిరీస్ కోసం బీసీసీఐ శనివారం జట్టును ప్రక టించింది.

**కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు.**

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ నాలుగో ఎడిషన్‌ను భారత్ యువ జట్టుతో ప్రారంభించనుంది. టెస్టుల నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత..

యువ శుభ్‌మన్ గిల్ కొత్త కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అదే సమయంలో రిషబ్ పంత్‌ని వైస్ కెప్టెన్‌గా నియమించారు. విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్ తర్వాత అతని స్థానంలో సాయి సుదర్శన్ ఎంపికయ్యాడు. భారత జట్టులో అనుభవజ్ఞులైన ఇద్దరు ఆటగాళ్లు రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా మాత్రమే.

అంతేకాకుండా కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్‌లకు కూడా జట్టులో చోటు కల్పించారు. జస్ప్రీత్ బుమ్రా ఫాస్ట్ బౌలింగ్ అటాక్‌కు నాయకత్వం వహిస్తాడు. అర్ష్‌దీప్ సింగ్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. వీరిద్దరితో పాటు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, శార్దూల్ ఠాకూర్‌లు కూడా చోటు దక్కించుకున్నారు.

**ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు**

**శుభమన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీం ద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వా షింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.**

# SPORTS

## మరో 100 ఏళ్లలో కూడా చెక్కుచెదరని రోహిత్ మాన్‌స్టర్ రికార్డు.. ఏంటో తెలుసా?



: క్రికెట్ చరిత్రలో ఎందరో దిగ్గజ బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. కానీ, వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ సృష్టించిన ఒక రికార్డు మాత్రం అరుదైనది. ఇది మరో 100 ఏళ్ల వరకు బ్రేక్ చేయడం సాధ్యం కాదనిపిస్తోంది. ఆ రికార్డ్ ఏంటో తెలిస్తే, మీరు కూడా ఇదే మాట అంటారు. రోహిత్ బద్దలవ్వని రికార్డ్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. అదే మూడు డబుల్ సెంచరీలు. ఈ ఘనతను సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. ఈ రికార్డును బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆ మూడు అద్భుత ఇన్నింగ్స్‌లు ఎప్పుడొచ్చాయో తెలుసా?**

209 %జం% ఆస్ట్రేలియా (బెంగుళూరు, 2013): రోహిత్ శర్మ తన వన్డే కెరీర్‌లో మొట్టమొదటి డబుల్ సెంచరీని ఆస్ట్రేలియాపై బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 158 బంతుల్లో 209 పరుగులు చేశాడు. ఇందులో 12 ఫోర్లు, 16 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఇది అతని కెరీర్‌లో ఒక మలుపు తిప్పిన ఇన్నింగ్స్. 264 %జం% శ్రీలంక (కోల్‌కతా, 2014): ఇది రోహిత్ శర్మ సాధించిన అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోరు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో శ్రీలంకపై అతను 173 బంతుల్లో 264 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఒక బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక స్కోరు ఇది. ఈ రికార్డు కూడా ఇప్పట్లో బద్దలవడం కష్టం. 208 %జం% శ్రీలంక (మొహాలీ, 2017):లి మొహాలీలో శ్రీలంకపైనే రోహిత్ శర్మ తన మూడవ డబుల్ సెంచరీని సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 153 బంతుల్లో 208 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 13 ఫోర్లు, 12 సిక్సర్లు ఉన్నాయి. తన వివాహ వార్షికోత్సవం రోజున ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడటం విశేషం.

**రోహిత్ ఈ రికార్డ్ ఎందుకు అసాధ్యం?**

వన్డే క్రికెట్ ఫార్మాట్‌లో 50 ఓవర్లలో ఒక బ్యాట్స్‌మెన్ డబుల్ సెంచరీ సాధించడమే ఒక అద్భుతం. అలాంటిది మూడు సార్లు డబుల్ సెంచరీలు నమోదు చేయడం అంటే అది మామూలు విషయం కాదు. రోహిత్ శర్మ అద్భుతమైన టైమింగ్, సిక్సర్లు బాదే సామర్థ్యం, సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడే ఓపిక ఈ రికార్డుకు కారణంగా నిలిచింది. ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో అనేక మంది పవర్‌హిట్టర్లు ఉన్నప్పటికీ, నిలకడగా ఈ స్థాయిలో పరుగులు చేయడం, పెద్ద స్కోర్లుగా మలచడం చాలా కష్టం. క్రికెట్‌లో టీ20 ఫార్మాట్ ప్రభావం పెరగడంతో ఆటగాళ్లు వేగంగా పరుగుధించలు సాడాని%అఁ%కి మొగ్గు చూపుతున్నారు. దీంతో ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండి డబుల్ సెంచరీ చేయడం అనేది చాలా అరుదైపోయింది. రోహిత్ శర్మ వన్డేల్లో సాధించిన ఈ మూడు డబుల్ సెంచరీల రికార్డు, అతనిని "హిట్‌మ్యాన్"గా మార్చడమే కాకుండా, క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన స్థానాన్ని కల్పించింది. ఈ రికార్డును బద్దలు కొట్టడానికి భవిష్యత్తులో ఏ బ్యాట్స్‌మెన్ వచ్చినా, అతనికి ఒక గొప్ప సవాలు ఎదురవడం ఖాయం.

## ఆడు మగాడ్రా బుజ్జీ..
## ఫాస్టెస్ట్ సెంచరీతో ఇంగ్లీషోళ్లనే గజగజ వణికించేశాడుగా..

: క్రికెట్ ప్రపంచంలో ఓ జింబాబ్వే ప్లేయర్ సంచలనం సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే యువ బ్యాటర్ బ్రయాన్ బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్‌తో 139 పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో బెన్నెట్ చూపిన ప్రతిభ, అతని దేశానికి ఒక గొప్ప గుర్తింపును తెచ్చింది. ఇంగ్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరును డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన జింబాబ్వేకు బ్యాటింగ్ సవాలుగా మారింది. ఈ సమయంలో, బ్రయాన్ బెన్నెట్ క్రీజ్‌లోకి వచ్చి ధైర్యంగా, దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అతను కేవలం 143 బంతుల్లో 139 పరుగులు సాధించాడు. ఇందులో 26 ఫోర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ స్ట్రైక్ రేట్ 97.20గా ఉండటం విశేషం. ఇది టెస్ట్ క్రికెట్‌లో జింబాబ్వే బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన శతకం (97 బంతుల్లో సెంచరీ)గా మారింది. అతను తన ఇన్నింగ్స్‌లో పలు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (42)తో కలిసి 65 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత సీన్ విలియమ్స్ (25)తో కలిసి 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ పరుగులు జింబాబ్వే ఇన్నింగ్స్‌కు ఒక మంచి పునాది వేశాయి. అయితే, బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, జింబాబ్వే జట్టు 265 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జింబాబ్వేను ఫాలో ఆన్ ఆడిస్తోంది. రెండవ ఇన్నింగ్స్‌లో బెన్నెట్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఈ మ్యాచ్‌లో బెన్నెట్ ప్రదర్శన అతని కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అతని రెండవ శతకం. అలాగే ఇదే అతని అత్యధిక స్కోరుగా నిలిచింది. అతని ఈ ఫియర్ లెస్ బ్యాటింగ్, జింబాబ్వే క్రికెట్‌కు ఒక ఆశాకిరణంలా నిలిచింది. బ్రయాన్ బెన్నెట్ భవిష్యత్తులో జింబాబ్వే క్రికెట్‌లో ఒక కీలక ఆటగాడిగా మారతాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఇంగ్లాండ్ విజయానికి 8 వికెట్లు..

జింబాబ్వే 265 పరుగులకు ఆలౌట్ అయిన తర్వాత ఇంగ్లాండ్ 300 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత జింబాబ్వేకు ఫాలో ఆన్ ఇచ్చింది. రెండో రోజు బ్యాటింగ్ ముగిసే సమయానికి జింబాబ్వే 30 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయి ఆడుతోంది. ఇంగ్లాండ్ గెలవాలంటే 8 వికెట్లు అవసరం.

మ్యాచ్ సంక్షిప్త స్కోరు:

ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్: 565/6 డిక్లేర్డ్

జింబాబ్వే మొదటి ఇన్నింగ్స్: 265 (బ్రయాన్ బెన్నెట్ 139)

జింబాబ్వే రెండవ ఇన్నింగ్స్ (ఫాలో ఆన్): 30/2 (రెండవ రోజు ఆట ముగిసే సమయానికి)



## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ.. ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా



**టీమిండియా స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లెజెండ్ విరాట్ కోహ్లీ అరుదైన ఘనత సాధించాడు. టీ20 క్రికెట్‌లో ఒకే జట్టు తరపున 800 ఫోర్లు కొట్టిన తొలి ఆటగాడిగా విరాట్ వరల్డ్ రికార్డు సృష్టించాడు.**

**ఐపీఎల్ 2025 లో భాగంగా శుక్రవారం లక్నో వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఘనత అందుకున్నాడు. కోహ్లీ ఇప్పటివరకు ఆర్సీబీ తరపున 801 ఫోర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 25 బంతులు ఎదుర్కొని ఏడు ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 43 పరుగులు చేశాడు. ఇక ఈ రేర్ ఫీట్ సాధించిన జాబితాలో ఇం?గ్లండ్ ఆటగాడు జేమ్స్ విన్స్(694) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. విన్స్ హాంప్‌షైర్ క్రికెట్ క్లబ్ తరపున ఆడి ఈ ఫీట్ నమోదు చేశాడు.**

**టీ20ల్లో ఒకే జట్టు తరుపున అత్యధిక ఫోర్లు కొట్టిన ఆటగాళ్లు వీరే..**

**విరాట్ కోహ్లీ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) %-% 801 ఫోర్లు**

**జేమ్స్ విన్స్ (హాంప్‌షైర్) - 694 ఫోర్లు**

**అలెక్స్ హేల్స్ (నాటింగ్‌హామ్‌షైర్) - 563 ఫోర్లు**

**రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్) - 550 ఫోర్లు**

**ల్యూక్ రైట్ (ససెక్స్) - 529 ఫోర్లు**

**ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఆర్సీబీకి సన్‌రైజర్స్ ఝులక్ ఇచ్చింది. బెంగళూరుపై 45 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది.**

**తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు సాధించింది. ఇషాన్ కిషన్ (94 నాటౌ ట్‌బీ 48 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అభిషేక్ శర్మ (34బీ 17 బం తుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లు), అనికేత్ వర్మ(26బీ 9 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లు), క్లాసెన్(24) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం లక్ష్య చేధనలో ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది.**

# ఇది కదా సక్సెస్ అంటే.. 25 ఏళ్లకే టీమిండియా కెప్టెన్‌గా

భారత టెస్టు క్రికెట్ జట్టుకు కొత్త నాయకుడొచ్చాడు. రోహిత్ శర్మ వారసుడు ఎవరో తేలిపోయింది. టీమిండియా టెస్టు కెప్టెన్‌గా యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అందరూ ఊహించినట్టే గిల్‌కే భారత జట్టు పగ్గాలను బీసీసీఐ అప్పగించింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం అధికారికంగా ప్రకటించింది. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పంజాబీ క్రికెటర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశామని ఛీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌పేర్కొన్నాడు. ఇక అరంగేట్రం చేసిన ఐదేళ్లలోనే భారత జట్టు కెప్టెన్‌గా ఎదిగిన గిల్‌పై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇది కదా సక్సెస్ అంటూ గిల్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. గిల్ 2020లో ఆస్ట్రేలియాపై తన టెస్టు అరంగేట్రం చేశాడు.




**25 ఏళ్ల వయస్సులోనే?**

భారత టెస్టు జట్టుకు 17 ఏళ్ల తర్వాత యువ కెప్టెన్ వచ్చాడు. 2008లో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే నుంచి భారత టెస్టు జట్టు పగ్గాలను ఎంఎస్ ధోని చేపట్టాడు. అప్పటికి ధోని వయస్సు 27 ఏళ్లు. ఆ తర్వాత 8 ఏళ్ల పాటు భారత జట్టును మిస్టర్ కూల్ నడిపించాడు. అనంతరం 2014 డిసెంబరులో ధోనీ నుంచి కోహ్లికి టెస్టు కెప్టెన్సీ దక్కింది. అప్పటికి విరాట్‌కు 27 ఏళు ,,. కోహ్లి సరిగ్గా ఏడేళ్ల పాటు రెడ్‌బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు సారథ్యం వహించాడు. కోహ్లి నాయకత్వంలోనే తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది. 2021 ఆఖరిలో కోహ్లి టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేయడంతో అతడి వారుసుడిగా రోహిత్ శర్మ బాధ్యతలు చేపట్టాడు. రోహిత్ శర్మ టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యేటప్పటికి అతడి వయస్సు 34 ఏళ్లు. ఇప్పుడు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో శుబ్‌మన్ గిల్ 25 ఏళ్ల వయస్సులోనే కొత్త టెస్టు కెప్టెన్‌గా నియిమితుడయ్యాడు. దీంతో దిగ్గజ కెప్టెన్లు ధోని, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల కంటే అతి తక్కువ వయస్సులోనే టీమిండియా నాయకుడిగా ఎంపికై గిల్ చరిత్ర సష్టించాడు. ఓవరాల్‌గా భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ఎంపికైన ఐదవ అతి పిన్న వయస్కుడిగా గిల్ నిలిచాడు. గిల్ ప్రస్తుత వయస్సు 25 సంవత్సరాల 285 రోజులు. ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో మాజీ కెప్టెన్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడి (21 సంవత్సరాల 77 రోజులు) అగ్రస్దానంలో ఉన్నాడు. గిల్ ఇప్పటివరకు 32 టెస్టులు ఆడి 35.06 సగటుతో 1893 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లలో 7 హాఫ్ సెంచరీలు, ఐదు శతకాలు ఉన్నాయి.

టెస్టుల్లో అతి పిన్న వయస్కులైన భారత కెప్టెన్లు వీరే..

మన్సూర్ అలీ ఖాన్ పటౌడి (21 సంవత్సరాల, 77 రోజులు)

సచిన్ టెండూల్కర్ -(23 సంవత్సరాల, 169 రోజులు)

కపిల్ దేవ్ (24 సంవత్సరాల, 48 రోజులు)

రవి శాస్త్రి (25 సంవత్సరాల, 229 రోజులు)

శుబ్‌మాన్ గిల్ (25 సంవత్సరాల, 285 రోజులు)

# సినిమా చిత్రం

## ఆలియా కేన్స్ ఆరంగేట్రం రెస్పాన్స్ ఇదీ



ఇండియా- పాక్ ఉద్రిక్తతల కారణంగా ఆలియా భట్ కేన్స్ 2025 ఆరంగేట్రాన్ని వాయిదా వేసుకుందని ప్రచారం సాగింది. కేన్స్ లో మొదటి రోజే ఆలియా అడుగుపెట్టాల్సింది...

కానీ అది జరగలేదు. దానికి కారణం భారత్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం.. అంటూ ప్రచారం సాగింది. ఎట్టకేలకు ఆలియా భట్ ఫ్రెంచ్ రివేరా వేదికగా జరుగుతున్న కేన్స్ ఉత్సవాల్లో పాల్గొంది. ఈ వేడుకల్లో ఆలియా ధరించిన ప్రత్యేకమైన డిజైనర్ దుస్తులు అందరి దృష్టిని ఆకర్షించాయి. కేన్స్ రెడ్ కార్పెట్‌పై తొలిసారి ఆరంగేట్రం చేస్తున్న ఆలియా ఆర్గాన్జా ఎనామెల్ ఫ్లోరల్ ఐవరీ రఫ్ఫుతో ఎంబ్రాయిడరీ చేసిన ఆఫ్-షోల్డర్ బస్టియర్ గౌనులో ప్రత్యక్షమైంది. ఈ లుక్ చాలా మందిని ఆకర్షించినా కానీ, 2017 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మల్లికా షెరావత్ మెర్మైడ్ గౌనును ఇమ్మిటేట్ చేసిందని నెటిజనులు గుర్తు చేశాయి. కేన్స్ లో మల్లిక చాలా సీనియర్. కొన్నేళ్ల పాటు రెడ్ కార్పెట్ లుక్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారగలిగింది. 2017లో మల్లిక పింక్ కలర్ అద్దిన, లేత గోధుమరంగు జార్జెస్ హొబెకా ఆఫ్-షోల్డర్ మెర్మైడ్ గౌనులో ఇండియన్ క్వీన్ లా కనిపించింది.

ఇప్పుడు మళ్లీ ఆలియా లుక్ దానిని గుర్తు చేసిందని నెటిజనులు కామెంట్ చేస్తున్నారు. అయితే ఆలియా ఆరంభ లుక్ అదిరిపోయిందంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ ఆలియా తన మేకప్ , హెయిర్ డిజైన్ ఎంపికతో కొంత నిరాశపరిచిందని అభిమానులు భావిస్తున్నారు.

ఒక నెటిజన్ వ్యాఖ్యానిస్తూ, ఈ దుస్తులు చాలా అందంగా ఉన్నాయి అని ప్రశంసించారు. ఆలియా నటిస్తున్న స్పై మూవీ ఆల్ఫా విడుదల కావాల్సి ఉంది. ఇందులో శార్వరి కూడా నటిస్తోంది. సంజయ్ లీలా భన్సాలీ లవ్ %ః% వార్‌లోను ఆలియా నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అప్పుడు అలా అన్న వాళ్లే ఇప్పుడు మెచ్చుకుంటున్నారు



నేచురల్ స్టార్ నాని హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా మంచి సక్సెస్ లో ఉన్నాడు. కోర్టు, హిట్3 సినిమాలతో నిర్మాతగా తక్కువ టైమ్ లో వరుస సక్సెస్‌లు అందుకున్న నాని, ఏం చేసినా దాని గురించి ఎంతో ఆలోచించే అడుగు ముందుకేస్తాడు. ఈ విషయం ఇప్పుడు మరోసారి స్పష్టమైంది. శైలేష్ కొలను దర్శకత్వంలో నాని నటిస్తూ నిర్మించిన హిట్3 సినిమా నార్త్ లో కేవలం సింగిల్ స్క్రీన్స్ లో మాత్రమే రిలీజైందనే విషయం తెలిసిందే. ఈ విషయంలో రిలీజ్ టైమ్ లో నాని కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. అయితే నార్త్ లో ఏదైనా సినిమాను మల్టీప్లెక్స్ లో రిలీజ్ చేయాలంటే ఓటీటీ రిలీజ్ కనీసం 50 రోజుల తర్వాతే ఉండాలనేది అక్కడి రూల్. దానికి సదరు నిర్మాత ఒప్పుకుంటేనే మల్టీప్లెక్సుల్లో సినిమాలు ఆడతాయి. లేదంటే ఆడవు. హిట్3 సినిమా విషయంలో నాని ఆ రూల్ కు నో చెప్పి నెట్‌ఫ్లిక్స్ తో 28 రోజుల స్ట్రీమింగ్ కు డీల్ కుదుర్చుకుని, నార్త్ లో కేవలం సింగిల్ స్క్రీన్ రిలీజ్‌నే ప్లాన్ చేసుకున్నాడు. హిట్3 రిలీజయ్యాక తెలుగు రాష్ట్రాల్లో మిక్స్డ్ టాక్ తో మొదలై మంచి లాభాలనే తెచ్చిపెట్టింది. కానీ నార్త్ లో మాత్రం హిట్3 మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఇప్పుడు మే 29న హిట్3 నెట్‌ఫ్లిక్స్ లోకి వచ్చేస్తుంది. ఇదంతా చూస్తుంటే నాని హిట్3 ఓటీటీ విషయంలో తీసుకున్న డెసిషనే కరెక్ట్ అనిపిస్తుంది. ఎందుకంటే నార్త్ ఆడియన్స్ కు హిట్3 పెద్దగా ఎక్కలేదు. వారిని నమ్ముకుని మల్టీప్లెక్సుల డీల్ కు ఒప్పుకుని ఉంటే నెట్‌ఫ్లిక్స్ హిట్3 కోసం నానికి ఆఫర్ చేసిన మొత్తం రేటులో భారీ కోత పడేది. దీంతో నాని నష్టపోయేవాడు. అయితే ఇప్పుడు విషయం తెలుసుకున్న అందరూ నానిని ఈ విషయంలో మెచ్చుకుంటున్నారు. ఓ వైపు థియేటర్ రిలీజ్, ఓటీటీ రిలీజ్ కు గ్యాప్ ఉండాలని నిర్మాతలకు ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న టైమ్ లో నాని లాంటి నిర్మాత తీసుకున్న నిర్ణయం వారిలో ఏమైనా మార్పును తీసు కొస్తుందేమో చూడాలి. ఒకటి మాత్రం నిజం, మేకర్స్ మంచి కంటెంట్ తో అలరించగలిగితేనే ఈ రోజుల్లో ఆడియన్స్ థియేటర్లకు వస్తున్నారు తప్పించి లేదంటే ఎంత స్టార్ క్యాస్టింగ్ ఉన్నా, ఎంత భారీ బడ్జెట్ సినిమా అయినా దాన్ని చూడాలనుకోవడం లేదు మన ప్రేక్షకులు.

## అనగనగా నయా ట్రెండ్‌కు శ్రీకారం చుడుతుందా?




ఇంతకుముందు ఏదైనా సినిమాలు చూడాలంటే థియేటర్లోనే చూడాలి. లేదంటే టీవీ ఛానెల్స్ లో చూడాలి. కానీ మారుతున్న జెనరేషన్ లో భాగంగా ఇప్పుడు ఓటీటీలు వచ్చేశాయి. పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు, డాక్యుమెంటరీలు, రియాలిటీ షోలు సైతం ఈ ఓటీటీల్లోనే చూస్తున్నారు ఆడియన్స్. కరోనా ద్వారా ఈ ఓటీటీల వాడకం బాగా పెరిగింది. థియేటర్ రిలీజ్ కు ఇబ్బంది పడే ఎన్నో సినిమాలకు ఓటీటీలు దేవాలయాల్లా కనిపిస్తున్నాయి. అందుకే కోవిడ్ నుంచి చాలా సినిమాలు నేరుగా ఓటీటీలో రిలీజయ్యాయి. అంతేకాదు, థియేటర్ రన్ తర్వాత కూడా కొత్త సినిమాలు ఓటీటీలో రిలీజవుతుండటం చాలా కామన్. కానీ ఇప్పుడు దానికి రివర్స్ లో ఓటీటీలో రిలీజైన ఓ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు వెళ్లబోతుంది. రీసెంట్ గా ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కు వచ్చిన అనగనగా అనే సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. విమర్శకులు సైతం ఈ సినిమాను ప్రశంసిస్తున్నారు. కొన్ని ఏరియాల్లో ఫ్రీ ప్రీమియర్లు వేస్తే అవి కూడా హౌస్ ఫుల్స్ అయ్యాయి.

ఈ సినిమా ప్రీమియర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే అనగనగా సినిమాకు పెయిడ్ షో లు వేయనున్నట్టు ఆ సినిమాలో మెయిన్ లీడ్ గా నటించిన సుమంత్ తెలిపాడు. అయితే ఓటీటీలో రిలీజైన సినిమా ఇలా థియేటర్లలో రిలీజ్ చేయడం ఇదేమీ ఫస్ట్ టైమ్ కాదు. గతంలో కూడా కొన్ని సినిమాలను ఇలానే చేశారు కానీ అవేమీ పెద్దగా క్లిక్ అవలేదు. కానీ అనగనగా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆ సినిమా ఆకట్టుకునే ఛాన్స్ ఉంది. లిమిటెడ్ స్క్రీన్స్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్న అనగనగా ఓ కొత్త ట్రెండ్ కు తప్పకుండా నాంది పలుకుతుందని మేకర్స్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఒకవేళ మ్యాజిక్ జరిగి థియేటర్లలో కూడా ఈ సినిమా హిట్ అయితే పలువురు దీన్ని ఫాలో అయ్యే ఛాన్సుంది. అలా అని ఏ సినిమాను పడితే ఆ సినిమాను ఓటీటీలో రిలీజ్ అయ్యాక థియేటర్లలోకి తీసుకొచ్చి రిలీజ్ చేస్తే మొదటికే మోసం వచ్చే ఛాన్స్ కూడా ఉంది. అయితే అనగనగా థియేట్రికల్ రిలీజ్ విషయంలో మాత్రం మేకర్స్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారు.

## 157 లో మెగాస్టార్ శివ శంకర వర ప్రసాద్!



మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. జూన్ నుంచి ప్లాన్ చేసుకున్నా? అనూహ్యంగా దర్శకుడు అనీల్ రావిపూడి శుక్రవారం నుంచే పట్టాలెక్కించారు. చిరంజీవితో పాటు ప్రధాన తారగణమంతా తొలి షెడ్యూల్ తొలి రోజు షూటింగ్ లో పాల్గొన్నారు. వాళ్లపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఇప్పటికే చిరంజీవి పాత్ర ఎలా ఉంటుందన్నది ముందే రివీల్ చేసారు. ఈ సినిమాలో చిరు మరో 'చంటబ్బాయి'లా హైలైట్ అవుతారని వినిపిస్తుంది. హిలేరియస్ ఎంటర్ టైనర్ లో చిరు పాత్ర చాలా కామిక్ గా ఉంటుందని ముందే రివీల్ చేసారు. చిరంజీవి చాలా కాలం తర్వాత ఎంతో ఇష్టపడి చేస్తోన్న కామెడీ చిత్రమిది. తాజాగా చిరు పాత్రకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. ఇందులో చిరంజీవి పాత్ర పేరు శివ శంకర వర ప్రసాద్ అట. ఈ పేరు ఇప్పటి జనరేషన్ చాలా మందికి తెలియదు. చిరంజీవి అసలు పేరు శివ శంకర వర ప్రసాద్. స్టార్ కాక ముందు ఇదే పేరుతో పిలవబడే వారు. స్టార్ అయిన తర్వాత స్క్రీన్ నేమ్ చిరంజీవి అయింది. అక్కడ నుంచి పెద్ద స్టార్ అవ్వడంతో మెగాస్టార్ అనే బిరుదు దక్కిం చుకున్నారు. అలా శివ శంకర వర ప్రసాద్ పరిశ్రమలో చిరంజీవిగా, మెగాస్టార్ గా ఎదిగారు. 157లో శివ శంకర వర ప్రసాద్ వాస్తవ పేరునే పెట్టే సాహసం అనీల్ చేసాడంటే? దాని వెనుక బలమైన రీజన్ ఉంటుంది. కెమెరా వెనుక చిరంజీవి ఎలా ఉంటారు? అన్నది పాత్రలో జోడించి ఉంటారని సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. చిరంజీవి రియల్ క్యారక్టరైజేషన్ కూడా ఇందులో ఉంటుందంటున్నారు. చిరంజీవి నుంచి అనుమతి వచ్చాకే ఆయన వాస్తవ పేరు పాత్రకు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఈ సినిమా టైటిల్ పై ఆసక్తి నెలకొంది. అనీల్ సినిమా టైటిల్స్ కూడా క్యాచీగా ఉంటాయి. స్టోరీనే బట్టే టైటిల్ పెడుతుంటాడు.

## జాన్వీకి టాలీవుడ్ లో మరో బంపరాఫర్?




బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తెలుగు సినిమాలపై ఎక్కువ ఫోకస్ చేసింది. తెలుగు సినిమాల్లోకి ఎంటరై సౌత్ సినిమాతో మంచి సంబంధాన్ని ఏర్పరచుకుంది జాన్వీ. తన తల్లి ఎక్కువగా సినిమాలు చేసి రాణించిన తెలుగులో సినిమాలు చేస్తే తల్లికి క్లోజ్ గా ఉండొచ్చనే భావనతో జాన్వీ టాలీవుడ్ పై ఎక్కువ ఫోకస్ చేసింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన దేవర సినిమాతో జాన్వీ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.

ఇప్పుడు జాన్వీకి తెలుగులో వరుస వకాశాలొస్తున్నాయి. దేవర సినిమా రిలీజ్ కాకుండా సెట్స్ పై ఉన్నప్పుడే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమాలో ఆఫర్ ను కొట్టేసింది. తెలుగులో మొదటి సినిమాను ఎన్టీఆర్ తో చేసిన జాన్వీ, రెండో సినిమాను చరణ్ తో లైన్ లో పెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న పెద్దిని బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నాడు. ఇందులో రామ్ చరణ్ అథ్లెట్ గా కనిపించనున్నాడు. కానీ పెద్దిలో జాన్వీ పాత్రకు సంబంధించిన వివరాలు మాత్రం ఇప్పటివరకు బయటకు రాలేదు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న పెద్ది సినిమా జాన్వీకి తెలుగులో మరింత క్రేజ్ ను పెంచుతుందని ఆమె ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే పెద్ది సినిమా రిలీజ్ కాకుండా ఆ సినిమా సెట్స్ పై ఉన్నప్పుడే జాన్వీకి తెలుగు నుంచి మరో ఆఫర్ కూడా రాబోతున్నట్టు సమాచారం. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా పాన్ ఇండియా డైరెక్టర్ అట్లీ డైరెక్షన్ లో తెరకెక్కనున్న సినిమాలో జాన్వీ నటించనుందని తెలుస్తోంది. జవాన్ లాంటి బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత అట్లీ నుంచి రాబోతున్న సినిమా కావడంతో ఈ మూవీపై అందరికీ భారీ అంచనాలున్నాయి.

ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలో మృణాల్ ఠాకూర్, అనన్యా పాండే లాంటి హీరోయిన్లు నటించనున్నారని ఇప్పటికే వార్తలొచ్చాయి. అయితే ఇప్పుడదే సినిమాలో ఓ హీరోయిన్ గా జాన్వీ కపూర్ ను కూడా తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నారట. అన్నీ కుదిరి ఈ సినిమాలో కూడా జాన్వీ ఛాన్స్ అందుకుంటే టాలీవుడ్ లో జాన్వీ కెరీర్ కు ఇక తిరుగుండదని చెప్పొచ్చు.

## కుబేర గోల.. ఫ్యాన్స్ కోపాన్ని చిటికెలో తగ్గించేశారు



జూన్ 20న పాన్ ఇండియా రిలీజ్‌కు సిద్ధమవుతున్న ధనుష్ %-% నాగార్జున కాంబో చిత్రం కుబేరా ఓ చిన్న సంఘటనతో సోషల్ మీడియాలో పెద్ద హంగామా రేపింది. టాలెంటెడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. కానీ మే 25న విడుదలయ్యే టీజర్‌కి సంబంధించిన ప్రకటనలో తలెత్తిన చిన్న అపోహ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఓ పోస్టర్‌తోనే ఈ గందరగోళం మొదలైంది. కుబేరా చిత్ర యూనిట్ మే 23న టీజర్ రిలీజ్ డేట్ ప్రకటించగా.. ఆ పోస్టర్‌లో నాగార్జున ఒక్కరే కనిపించడం ధనుష్ ఫ్యాన్స్‌కి నచ్చలేదు. వెంటనే సోషల్ మీడియాలో /kubera-boycott- అనే హ్యాష్‌ట్యాగ్‌తో ట్రెండ్ మొదలైంది. ధనుష్‌ను తప్పించి నాగార్జునను మాత్రమే హైలైట్ చేయడంపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కుబేరా టీమ్ అసలైన ఉద్దేశం కొద్దిసేపటికే బయటపడింది. నాగార్జున సినీ రంగ ప్రవేశానికి 39 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆయన్ను ప్రత్యేకంగా హైలైట్ చేయడమే ఆ పోస్టర్ ఉద్దేశమని వెల్లడైంది. దీని వెంటనే..

20 నిమిషాల్లోనే ధనుష్ పాత్రను హైలైట్ చేసే మరో టీజర్ పోస్టర్ రిలీజ్ చేశారు. దీంతో పాటు ధనుష్ ఫ్యాన్స్ కోపాన్ని చల్లార్చే విధంగా స్పందించారు మేకర్స్. ఈ వివరణతో ధనుష్ ఫ్యాన్స్ కూడా శాంతించారు. బహుశా మేకర్స్ ముందుగా ప్లాన్ చేసిన విధంగా ఒక్కొక్కరి క్యారెక్టర్ పోస్టర్‌ల ద్వారా టీజర్‌ను ప్రమోట్ చేయాలనుకున్నారని అర్థమవుతోంది. కానీ అభిమానులు ముందుగా దాని వెనుక ఉద్దేశాన్ని అర్థం చేసుకోకపోవడంతో ఈ అపోహకు దారి తీసింది. ఇలాంటివి గతంలో కూడా అనేకసార్లు చోటు చేసుకున్నాయి.

స్టార్ హీరోలకు సంబంధించిన సినిమాల్లో అభిమానుల మధ్య ఈ తరహా పొరపాట్లు సర్వసాధారణమే. ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో నిమిషాల వ్యవధిల్లో ట్రెండ్‌లు మారిపోతుంటాయి. అయితే, మేకర్స్ స్పందన త్వరగా వచ్చినందున ఈ వివాదం పెద్దగా కొనసాగకుండా ముగిసింది. ఇక మే 25న రాబోతున్న కుబేరా టీజర్ పై భారీగా అంచనాలున్నాయి. సినిమా లుక్, కంటెంట్, మ్యూజిక్ అన్నీ కొత్తగా ఉండబోతున్నాయని టాక్. నాగార్జున పాత్రలో కొత్తదనం ఉంటుందని ఇప్పటికే టీజర్ పోస్టర్ సూచిస్తోంది. ధనుష్ అభిమానులు కూడా వెంటనే మద్దతు ప్రకటించడంతో, ఈ సినిమా ప్రమోషన్‌కు మించిన హైప్ కలిగించిందనే చెప్పాలి. త్వరలో టీజర్ విడుదలవుతుండగా.. సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com